ప్రజాశక్తి

శుక్రవారం 12 ఏప్రిల్ 2024 పేజీలు 8

విజయనగరం

పార్వతీపురం మన్యం

చల్లారుతున్న అసంతృప్తులు

- ఎస్.కోట, నెల్లిమర్లలో వెనక్కి తగ్గిన ఆశావహులు
- విజయనగరం, గజపతినగరంలో సైలెంట్
- చీపురుపల్లిలో సర్దుబాట్లు
- సాలూరులోనూ ఇంకా కుదరని సయోధ్య
- కురుపాంలో వెనక్కి తగ్గని వేరుకుంపటి
- పాలకొండలో భూదేవి అసమ్మతిరాగం
- టిడిపిలో మారుతున్న పరిణామాలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

టిడిపిలో నెలకొన్న అసమ్మతిరాగాలు, అసంతృప్తులు మెల్లగా చల్లారుతున్నాయి. కొన్నిచోట్ల ఆశావహులు, అసంతృప్తివాదులు వెనక్కి తగ్గుతుండగా, మరికొన్ని చోట్ల మౌనం వహిస్తున్నారు. ఇంకొన్నిచోట్ల నాయకుల మధ్య సయోధ్య, సర్దుబాటులు జరుగుతున్నాయి. కురుపాంలో మాత్రం గ్రూపుల కుంపట యథాతథంగా కొనసాగుతోంది. పాలకొండ టిడిపి, జనసేన అభ్యర్థిని తాజాగా ప్రకటించడంతో అదే నియోజకవర్గానికి చెందిన భూదేవి అసమ్మతిరాగం తీస్తున్నారు. మొత్తానికి గతంతో పోలిస్తే టిడిపిలోవున్న అసమ్మతి సెగ నెమ్మదిగా తగ్గుతున్నట్టుగా కనిపిస్తోంది. కానీ, ఆచరణలో అభ్యర్థుల విజయానికి సహకారం ఎలా ఉంటుందో వేచి చూడాల్సిందే.

టిడిపిలో అసెంబ్లీ టిక్కెట్ల వ్యవహారంతో విజయనగరం, పార్వతీపురం జిల్లాల్లో దాదాపు అన్నిచోట్ల అసమ్మతి సెగలు కమ్ముకోవడం, కొన్ని నియోకవర్గాల్లో పదవులకు రాజీనామాలు చేయడం, స్వతంత్రంగా పోటీచేస్తామని హెచ్చరించడం తెలిసిందే. దీంతో, టిడిపి బాగా బలహీనపడినట్టుగా విశ్లేషణలు వెలువడ్డాయి. జనం నోట కూడా ఇదే వినిపించింది. పార్టీ అధినేత జోక్యంతో ఇప్పుడిప్పుడే ఒక్కతాటిపైకి వచ్చినట్టుగా కనిపిస్తున్నారు. ఎస్.కోట అసెంబ్లీ నియోజకవర్గంలో ఎమ్మెల్యే టిక్కెట్ ఆశించి భంగపడిన గొంప క్రిష్ణ (ఎన్ఆర్ఐ) స్వతంత్రంగా పోటీచేస్తానని ప్రకటించిన సంగతి తెలిసిందే. వేలాది మందితో భారీ ర్యాలీలు, సభలు కూడా నిర్వహించారు. చివరకు నాలుగు రోజుల క్రితం తానా ప్రతినిధి జోక్యంతో రాజీపడ్డారు. కొన్ని షరతులతో ఎమ్మెల్యే గెలుపునకు కృషిచేస్తానని ప్రకటించారు. విశాఖ ఎంపీ, ఎస్.కోట ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలిత కుమారితో కలిసి రెండు రోజుల క్రితం ఎన్నికల ప్రచారంలో కూడా పాల్గొనడంతో గ్రూపు విభేదాలు దాదాపు తొలగినట్టేనని తెలుగు తమ్ముళ్లు భావిస్తున్నారు. నెల్లిమర్ల అసెంబ్లీ టిక్కెట్‌ను జనసేనకు చెందిన లోకం మాధవికి కేటాయించిన సంగతి తెలిసిందే. టిడిపి నుంచి ఆశపడ్డ కర్రోతు బంగార్రాజు కూడా ఆమెతో కలిసి పనిచేసేందుకు నెల రోజులు పట్టింది. వారం క్రితం బంగార్రాజుతోపాటు ఇదే నియోజకవర్గంలోని మరో నాయకుడు కంది చంద్రశేఖర్‌ను కూడా చంద్రబాబు పిలిచి బుజ్జగించడంతో వీరంతా కలిసి పనిచేస్తున్నారు. గజపతినగరంలో మాజీ ఎమ్మెల్యే కెఎ నాయుడు కోటరీ అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్‌కు సహాయ నిరాకరణ ఉండేది. నాయుడు కోరిన వాయిదాలన్నీ గడిచిపోయినప్పటికీ టిక్కెట్ కేటాయింపులో మార్పు లేకపోవడంతో క్రమంగా ఆయన అనుయాయులు శ్రీనివాస్‌కు మద్ధతుదారులుగా మారుతున్నారు. శ్రీనివాస్‌ను కెఎ నాయుడు వ్యతిరేకిస్తున్నప్పటికీ తన కార్యాచరణ ప్రకటించి ముందుకు సాగకపోవడమే ఇందుకు కారణం. విజయనగరంలో (మిగతా..3లో)

సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

కూటమి విష ప్రచారాన్ని తిప్పికొట్టండి

- జగన్ చేసిన మంచినే వివరించండి
- ఎన్నికలకు 30 రోజులే కీలకం
- వైసిపి విస్తృత సమావేశంలో సుబ్బారెడ్డి, బొత్స

మాట్లాడుతున్న సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎన్‌డిఎ కూటమి విష ప్రచారాన్ని తిప్పికొట్టి జగన్ చేసిన మంచి పనులను ప్రజలకు వివరించాలని వైసిపి రీజనల్ కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పిలుపునిచ్చారు. వైసిపి ఉమ్మడి జిల్లా విస్తృత స్థాయి సమావేశం గుడువారం నగరంలోని జగన్నాథ ఫంక్షన్ హాలులో జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి పనులే 175 నియోజకవర్గాల్లో విజయాన్ని అందిస్తాయన్నారు. రానున్న 10 రోజుల్లో విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలో సిద్ధం సభల్లో ముఖ్యమంత్రి పాల్గొంటారని తెలిపారపు. రానున్న 30 రోజులు కీలకమైనవని, ప్రతి ఇంటికి వెళ్లి వైసిపికి ఓటు వేయాలని కోరాలని సూచించారు. కూటమి నాయకులు వాలంటీర్లు, పెన్షన్‌దారులపై దాడి చేస్తున్నారని, వారి ఓట్లు మనకు పడకుండా కుట్ర పన్నుతున్నారని అన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి కూటమి కుట్రలను వివరించాలన్నారు. పోలింగ్ బూత్ ల్లో ఎటువంటి లోపాలు లేకుండా చూసుకోవాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు చాలా కీలకమని, ఓటర్లను గుర్తించి మన పార్టీకి ఓటు వేసేలా చూడాలని కోరారు. సచివాలయం వారీగా బాధ్యత తీసుకొని పనిచేయాలని సూచించారు. నిర్లక్ష్యంగా ఉంటే నష్టపోయే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ కష్టపడితేనే మళ్లీ గౌరవం పొందుతామని అన్నారు.

మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ చిన్న చిన్న మనస్పర్థలు (మిగతా..3లో)

మసీదులో ప్రార్ధనలు చేస్తున్న ముస్లిములు

ఘనంగా రంజాన్ వేడుకలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

రంజాన్ సందర్భంగా జిల్లాలోని అన్ని మసీదుల్లోనూ ముస్లిములు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సుమారు 30 రోజులు ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లిములు రంజాన్ సందర్భంగా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆర్‌టిసి కాంప్లెక్సు సమీపంలోని ఈద్గా ప్రాంగణంలో ప్రార్థనలు చేశారు. అన్ని మతాల, కులాల ప్రజలంతా సుఖసంతోషాలతో మెలగాలని కోరారు. ప్రార్థనలు చేసుకునేందుకు స్థలం చాలక ఇబ్బంది పడుతున్నామని, ప్రభుత్వం మూడు ఎకరాల స్థలం కేటాయించాలని వక్ఫ్‌బోర్డు మాజీ అధ్యక్షులు కరీం కోరారు.

బొబ్బిలి : పట్టణంలో రంజాన్ వేడుకలు ఘనంగా జరిగాయి. షాదీఖానాలో గురువారం ప్రత్యేక నమాజ్ చేశారు. రంజాన్ ప్రాముఖ్యతను ముస్లిం కుల పెద్ద అబ్దుల్ కలాం వివరించారు. ముస్లిం సోదరులు, చిన్నారులు ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ముస్లింలకు ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయన రంజాన్ (మిగతా..3లో)

కార్మికులకు ద్రోహం చేస్తున్న పార్టీలకు బుద్ధిచెప్పాలి

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

కార్మిక హక్కులను కాలరాస్తూ, హక్కుల రక్షణ చట్టాలను రద్దు చేస్తున్న ప్రభుత్వాలకు రానున్న రోజుల్లో ప్రజలే తగిన బుద్ధి చెప్పాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు అన్నారు. గురువారం స్థానిక సుందరయ్య భవనంలో సిఐటియు విస్తృతస్థాయి సమావేశం జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని విమర్శించారు. సమస్యలు పరిష్కారం కోసం ఉద్యమిస్తే ఎన్నడూ లేనివిధంగా నిర్బంధాన్ని ప్రయోగించి ఉద్యమాలపై ఎస్మా చట్టం ఉపయోగించి కార్మికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ను పాలకులు కార్పొరేట్లకు ధారాదత్తం చేయాలని ప్రయత్నిస్తున్నారని, దీనిపై కార్మికులు ఉక్కు పట్టుదలతో పోరాడుతున్నారని అన్నారు. ప్రభుత్వ సంపదను కార్మికుల కష్టాన్ని పెట్టుబడిదారులకు అప్పజెప్పాలని కేంద్ర ప్రభుత్వం చూస్తుందని, కార్మికుల మధ్య మత ఆధారంగా గొడవల సృష్టించి భారత రాజ్యాంగ లౌకిక తత్వాన్ని నిర్వీర్యం చేస్తుందని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాల్సి ఉండగా ఆ విధంగా అమలు చేయకుండా కార్మికుల జీవితాలతో ఆట్లాడుకునే పరిస్థితి ఉందని అన్నారు. ఇలాంటి సందర్భంలో భవన కార్మికులు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, ఆశా వర్కర్లు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు శ్రమ దోపిడీకి గురవుతున్నారని అన్నారు. సంక్షేమ పథకాలు కూడా అమలు చేయని పరిస్థితి ఉందన్నారు. మున్సిపల్, సమగ్ర శిక్షణ, గ్రీన్ అంబాసిడర్లు, కాంట్రాక్ట్, అన్ని రకాల కార్మికులు సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. కరోనా సమయంలో మున్సిపల్, అంగన్వాడీ, ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు ప్రాణాలు తెగించి సేవలందించినా వారి కుటుంబాలకు ఎటువంటి భరోసా కల్పించలేదన్నారు. ఉపాధి కూలీలకు పనులు సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. కావున కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేసి, చట్టాలు పగడ్బందీగా అమలు చేయాలని, రాబోయే రోజుల్లో మరిన్ని పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు, నాయకులు వి.ఇందిర, ఎన్వై నాయుడు, ఆర్.రాము, బి.సూరిబాబు, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు సిహెచ్ నర్సింగరావు

పేదలకు ఇళ్ల స్థలాలేవి ?

- పట్టాలిచ్చినా స్థలం చూపని ప్రభుత్వం
- నాలుగున్నరేళ్లుగా నెల్లిమర్లలో ఇదే తంతు
- పట్టించుకోని నాయకులు, అధికారులు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నెల్లిమర్ల నగర పంచాయతీలో పేదలకు ఇళ్ల స్థలాలు ఎక్కడ అని ప్రశ్నిస్తున్నారు. వైసిపి అధికారం చేపట్టి నగర పంచాయతీలో 1500 మందిని గుర్తించి వారికి ఇళ్ళ పట్టాలు మంజూరు చేసి రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ చేసింది. అయితే కొండ ప్రాంతంలో ప్రభుత్వం ఇళ్ళ స్థలాలు కేటాయించడంతో అక్కడ ఎటువంటి సౌకర్యాలూ లేవని ఆ స్థలాన్ని లబ్ధిదారులు తిరస్కరించారు. దీంతో 62 మంది లబ్దిదార్లకు మండల పరిషత్ కార్యాలయం వద్ద పంప్ హౌస్ వెనుక ఇళ్ళ నిర్మాణం చేశారు. మిగతా 1400 మందికి మాత్రం వేరే చోట స్థలం చూపించలేదు. పలు మార్లు అధికార్లు, ప్రజాప్రతినిధుల వద్దకు వెళ్ళి గత 4సంవత్సరాలుగా మొరపెట్టుకున్నా ఫలితం లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూడమ్మ వనం వద్ద సర్వే నెంబర్316లో (ఎల్‌సిసి ల్యాండ్) ప్రభుత్వ మిగులు భూమి 45 ఎకరాలు ఉందని అందులో పేదలకు ఇళ్ళు స్థలాలు ఇవ్వాలని ప్రజా ప్రతినిధులు దృష్టికి తీసుకు వెళ్ళారు. అయితే గత సంవత్సరం ఎమ్మెల్యే కూడా ఇదే

సర్వే నెంబరు 316లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమి

స్థలంలో కొంత భూమిని సదరు రిజిస్ట్రేషన్ పత్రాలు ఇచ్చిన వారికి మంజూరు చేస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేదు. గత నాలుగున్నర సంవత్సరాలుగా పట్టాలు ఇచ్చిన వారికి ఇళ్ళ స్థలాలు చూపించాలని లబ్దిదార్లు మొరపెట్టుకున్నా ఫలితం మాత్రం దక్కలేదు. ఇంతలో ఎన్నికల సమీపిస్తున్నాయని ఈ హడావుడిలో తమను ఇంకెవరు పట్టించుకుంటారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి తమకు స్థలాలను కేటాయించాలని కోరతున్నారు.

సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్న పోలీసులు

నిరంతర పర్యవేక్షణకే సిసి కెమెరాలు

ప్రజాశక్తి - రామభద్రపురం

నిరంతర నిఘా పర్యవేక్షణకే సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్ఐ జ్ఞాన ప్రసాద్ తెలిపారు. గురువారం స్థానిక బై పాస్ రహదారి మార్గంలో కెమెరాలను ఏర్పాటు చేశారు. అన్ని రకాల చట్ట వ్యతిరేక కార్యకలాపాల నియంత్రణకు సీసీ కెమెరాలే ప్రదానం అన్నారు. వ్యాపార సంస్థల్లో కూడా వీటి ప్రాధాన్యత ఉందన్నారు. అన్ని ముఖ్య కూడల్లో వీటి సంఖ్యను పెంచి నేరాల తీవ్రత తగ్గించేందుకు కృషి చేస్తామన్నారు. ఎఎస్ఐ చిన్నయ్య ఆధ్వర్యంలో హెచ్‌సి రమణ ట్రాఫిక్ నియంత్రణ చేసి కెమెరాల ఏర్పాటుకు సహకరించారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌కు వినతి పత్రాన్నిస్తున్న గోపాలం

ఉపాధి పనులు ఒక్కపూటే పెట్టాలి

ప్రజాశక్తి- బొబ్బిలి రూరల్

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు ఒక్కపూట పెట్టాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి గోపాలం డిమాండ్ చేశారు. మండలంలోని ఎం.బూర్జవలస, కొత్తపెంటలో ఉపాధి కార్మికులతో ఆయన గురువారం సమావేశం నిర్వహించి ఒక్కపూట పనులు పెట్టాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతుందని విమర్శించారు. ఎండలు తీవ్రంగా ఉండడంతో రెండు పూటల పని చేయాలంటే వేతనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పని చేసే చోట నీడ, మంచినీటి సౌకర్యం కల్పించాలని, కనీస వేతనం రూ.304 ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెండు పూటల పని పెడితే పోరాటం చేస్తామన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి - రామభద్రపురం

మండలంలోని మరడాంలో సర్పంచ్ శంకరరావు ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐ ఆస్పత్రి నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 150 మంది రోగులకు వైద్యులు బీశెట్టి బాలభార్గవి, ప్రవీణ్, సిబ్బంది వివిధరకాల వైద్య సేవలు, పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలభార్గవి మాట్లాడుతూ సేవే పరమావధిగా గ్రామాల్లో నిరుపేద రోగులే లక్ష్యంగా మండల కేంద్రంలో ఆసుపత్రి ఏర్పాటు చేశామన్నారు. అన్ని రకాల వ్యాధులకు ఇక్కడ సూపర్ స్పెషాలిటీ వైద్యుల పర్యవేక్షణలో చికిత్సలు అందజే సేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. 24 గంటలు అన్ని రకాల వైద్య సేవలకు సిద్ధంగా ఉన్నట్లు వివరించారు. గ్రామీణులు ఈ ఆసుపత్రి సేవలు వినియోగించు కోవాలని కోరారు.

తనిఖీ చేస్తున్న వైద్యులు

జనసేన కార్యకర్తల ప్రచారం

ప్రజాశక్తి - భోగాపురం

మండల కేంద్రమైన భోగాపురం గ్రామంలోని పేద హరిజన పేట, అప్పన్నపేట గ్రామంలో గాజు గ్లాసు గుర్తుపై గురువారం ప్రచారం చేశారు. జనసేన పార్టీ గుర్తు గాజు గ్లాసు అంటూ ఇంటింటికి వెళ్లి గ్రామానికి చెందిన కార్యకర్తలు ప్రచారం చేశారు. వచ్చే ఎన్నికల్లో కూటమి అభ్యర్థి లోకం మాధవి గుర్తు గాజు గ్లాసని తెలియజేశారు. అందుకు ప్రతి ఒక్కరు గాజు గ్లాసును గుర్తుంచుకోవాలని ఈ సందర్భంగా కోరారు. పార్టీ నాయకులు పల్లంట జగదీష్, పల్ల రాంబాబు, బొల్లు త్రినాథ్, పవన్, సిరిగుడి వెంకటేష్, మాత నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎండ @ 43 డిగ్రీలు

- ఎండలతో అల్లాడుతున్న ప్రజలు
- నిర్మానుష్యంగా ప్రధాన రహదారులు, వీధులు

ప్రజాశక్తి- రేగిడి

ఎండ వేడి తీవ్రతతో పాటు వడగాల్పులకు ప్రజలు అల్లాడుతున్నారు. ఎన్నడూ లేని విధంగా ఏప్రిల్ నెలలోనే వడగాలులు వేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 43 డిగ్రీల బానుడు భగ భగ మండుతుంటే వృద్ధులు, చిన్నారులు అవస్థలు పడుతున్నారు. వీధులు, ప్రధాన రహదారులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. పాలకొండ-విశాఖపట్నం ప్రధాన రహదారి వడగాల్పులకు నిర్మానుష్యంగా మారింది. మరో ఐదు రోజులు పాటు వడగాలు వేస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించడంతో ఎలా గడపాలోనన్న ఆయోమయంలో ప్రజలు ఉన్నారు. ఈ ఎండలకు వృద్ధులు అస్వస్థతకు గురవుతున్నారు. ఆర్థిక స్తోమత ఉన్నవారు కూలర్లు, ఏసీలు కొనుగోలు చేసుకుంటున్నారు. ఇప్పటికే విపత్తుల కేంద్రం నుంచి అనేక సూచనలు, సలహాలు అందిస్తున్నారు. ఎండలో తిరగవద్దని అవసరం మేరకు బయటికి వెళ్లాలని ఉన్ని దుస్తులు వేసి టోపీలు పెట్టాలని సూచించారు. ఎప్పటికప్పుడు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, కొబ్బరి నీళ్లు, నిమ్మ నీరు తప్పనిసరిగా తాగాలని చెబుతున్నారు. చల్లని ప్రదేశాల్లో ఉండాలని, వడదెబ్బకు గురికాకుండా ప్రజల అప్రమత్తంగా ఉండాలని సూచనలు ఇస్తున్నారు. రేగిడి, బూరాడ వైద్యాధికారులు అసిరి నాయుడు, చలమయ్య వడదెబ్బలకు కావలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

ఖాళీగా ఉన్న వీధులు

ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా ఉన్న సంకిలి ప్రధాన రహదారి

ప్రారంభించారు... తాళం వేశారు..

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని వల్లంపూడిలో ఇటీవల ఆర్‌బికెను ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అట్టహాసంగా ప్రారంభించారు. కార్యాలయం ప్రారంభించి రోజులు గడుస్తున్న విధులు నిర్వహించడానికి సిబ్బందికి మాత్రం తలుపులు తెరవలేదు. దీంతో పాత భవనంలోనే వ్యవసాయ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయకపోవడంతోనే కాంట్రాక్టర్ తలుపులకు తాళాలు వేసినట్లు చెబుతున్నారు. ప్రభుత్వం రైతుల పక్షపాతి అని చెప్పడం తప్ప క్షేత్ర స్థాయిలో వారికి సకాలంలో సేవలు అందడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ప్రజాధనంతో నిర్మించిన రైతు భరోసా కేంద్రానికి చెల్లించాల్సిన బిల్లులు చెల్లించి భవనాన్ని సిబ్బందికి అప్పగించాలని పలువురు కోరుతున్నారు.

తాళం వేసి ఉన్న ఆర్‌బికె భవనం ఇదే..

వైసిపితో బిసిలకు అన్యాయం : టిడిపి

మాట్లాడుతున్న టిడిపి అభ్యర్థి శ్రీనివాస్

ప్రజాశక్తి - గంట్యాడ

జగన్ ప్రభుత్వంలో బిసిలకు అన్యాయం జరిగిందని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. గురువారం మధుపాడలో జయహో బిసి కార్యక్రమాన్ని నిర్వహించారు. టిడిపి మండల అధ్యక్షులు కొండపల్లి భాస్కరనాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వంలో బిసిలకు కార్పొరేషన్ల ద్వారా చేతి వృత్తి వ్యాపారం చేసుకున్న బిసి సోదరులకు సబ్సిడీ లోను ఇచ్చే వారిని అన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కలిసి రూపొందించిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలలోకి తీసుకెళ్లాలన్నారు. చంద్ర బాబును ముఖ్యమంత్రిని చేస్తే రాష్ట్రంలో బిసిలకు న్యాయం జరుగుతుందన్నారు. రానున్న ఎన్నికలలో అందరూ సైకిల్ గుర్తుకే ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బిసి సాధికారత నాయకులు పల్లి విజయ్‌కుమార్, కురుపులు రమేష్ కుమార్, రామునాయుడు, బూడి అప్పలనాయుడు, పల్లె వెంకటరావు, సత్యనారాయణ, సీతారాం పాల్గొన్నారు.

వైసిపి ఓటమే కూటమి ధ్యేయం

ప్రజాశక్తి - పూసపాటిరేగ

వైసిపి ఓటమే కూటమి ధ్యేయమని నెల్లిమర్ల కూటమి అభ్యర్థి లోకం మాధవి అన్నారు. గురువారం మండలంలోని గుంపాం, తొత్తడాం, తాళపేట, వెంపడాం గ్రామాల్లో కూటమి అభ్యర్థి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెతో పాటు టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు, మండల పార్టీ అధ్యక్షలు మహంతి శంకరావు ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. కూటమి అభ్యర్థి మాదవమ్మని గెలిపించాలని కోరారు. ప్రచారం కార్యక్రమంలో కూటమి నేతలు దంగా భూలోకా, ఆకిరి ప్రసాదరావు, పిన్నింటి సన్యాసినాయుడు, పసుపులేటి గోపి, దంతులూరి సూర్యనారాయణరాజు, పిన్నింటి శ్రీనువాసరావు, కొత్తకోట రమణ, కొత్తకోట బాలకృష్ణ, జనసేన నాయకులు పతివాడ శ్రీను, నక్కాన రమణ, శంకాభత్తుల సత్తిబాబు, మహంతి శివ, జలపారి శివ, స్మార్ట్ రమేష్, కిలారి రమేష్, కె.రాజారావు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన పేరాపురం వైసిపి నాయకులు

భోగాపురం: పూసపాటిరేగ మండలం పేరాపురం గ్రామానికి చెందిన పలువురు వైసిపి నాయకులు ఆ పార్టీని వీడి జనసేనలో చేరారు. ఆ గ్రామానికి చెందిన రౌతు నర్సింగరావు, వార్డు మెంబర్ రౌతు భాస్కరరావుతో పాటు వారి అనుచరులు గురువారం జనసేనలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ముంజేరులోని జనసేన క్యాంపు కార్యాలయంలో కూటమి అభ్యర్థి లోకం మాధవి వారికి కండువాలేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి పాలనలో నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. చల్లవానితోట సర్పంచ్ పతివాడ శ్రీనివాసరావు, బోర సతీష్, కొలచన రమేష్, శరత్, బోర సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రచారం చేస్తున్న జనసేన, టిడిపి నాయకులు

తాత్కాలిక కోర్టు భవనాన్ని సిద్ధం చేయించాలి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఎస్‌కోటలో తాత్కాలిక అద్దె ప్రాతిపదికన తీసుకున్న భవనంలో కోర్టుకు అవసరమైన విధంగా భవనాన్ని సిద్ధం చేయించాలని జూనియర్ సివిల్ జడ్జి కుమారి సబ్బవరపు వాణి న్యాయవాదులకు సూచించారు. ఎస్.కోట బార్ అసోసియేషన్‌కు నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శి జి.సూరిదేముడు, బి.సత్యనారాయణ ఆధ్వర్యంలో న్యాయవాదులతో తాత్కాలిక కోర్టు నిర్మాణ పనులపై ఆమె గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్.కోటలో ప్రస్తుతం నిర్వహిస్తున్న కోర్టు భవనం శిథిలావస్థకు చేరినందున అద్దె భవనంలోకి మారేందుకు గాను జిల్లా ప్రధాన న్యాయమూర్తి పంపిన నివేదిక మేరకు హైకోర్టు ఉత్తర్వులు మంజూరు చేశారని వెల్లడించారు. ఇదే విషయాన్ని సంబంధిత తాత్కాలిక అద్దె భవనం యజమానికి తెలిపారు. త్వరితగతిన పనులు పూర్తి చేయించాలని భవన యజమానిని ఆదేశించారు. అనంతరం జూనియర్ సివిల్ జడ్జి, న్యాయవాదులు ఎస్.కోట పట్టణంలోని అలంకార్ థియేటర్ సమీపంలో అద్దె ప్రాతిపదికన తీసుకున్న సాయికృష్ణ కళ్యాణ మండపం భవనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు జి.సూరిదేముడు, కార్యదర్శి బి.సత్యనారాయణ, సీనియర్ న్యాయవాదులు అల్లు సత్యాజీ, టిటివి రమానాజీ, గేదెల ప్రకాష్, ఎం.దొరబాబు, బి.త్రిమూర్తులు, డబ్ల్యు.ఎన్.శర్మ, వారాది ఈశ్వరరావు, టివిఆర్ మూర్తి, బివిఎస్ రామారావు, ఆర్.సత్యనారాయణ, జి.చిట్టిబాబు, బొడబళ్ల రామకృష్ణ, ఎం.అప్పారావు, ఎల్.అప్పారావు, బొడ్డు వెంకటరావు, బొబ్బిలి రామకృష్ణ, కోర్టు సూపరింటెండెంట్ సంపత్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న జిల్లా జడ్జి వాణి

చల్లారుతున్న అసంతృప్తులు

(మొదటి పేజీ తరువాయి)

స్వతంత్రంగా రంగంలోకి దిగుతానని ప్రకటించిన మాజీ ఎమ్మెల్యే మీసాల గీత కూడా ప్రస్తుతం స్తబ్ధతగా ఉన్నారు. దీంతో, ఈ రెండు నియోజకవర్గాల్లోనూ గ్రూపుల ప్రభావం క్రమంగా తగ్గుతున్నట్టుగా కనిపిస్తోంది. చీపురుపల్లి సీటు ఆశపడి భంగపడ్డ కిమిడి నాగార్జున కినుక వహించినప్పటికీ అభ్యర్థి కళావెంకటరావు నెమ్మదిగా పార్టీలో పట్టుబిగిస్తున్నారు. నాగార్జున అనుయాయులతోపాటు వైసిపిలోని అసంతృప్తి నాయకులను కూడా తనవైపు తిప్పుకుంటున్నారు. ముఖ్యంగా మెరకముడిదాం మడలంలో కీలకనేతలుగా ఉన్న కోట్ల మోతీలాల్‌నాయుడు రెండు రోజుల క్రితం టిడిపిలో చేరారు. అంతకు ముందు, ఆ తరువాత కూడా చేరికలు కనిపించాయి. మన్యం జిల్లా సాలూరు నియోకవర్గం అభ్యర్థి గుమ్మడి సంధ్యారాణి, మక్కువ మండలంలోని కీలకనేతగా ఉన్న పెంట తిరుపతిరావు మధ్య నాయకులు సయోధ్య కుదిర్చారు. అయితే తిరుపతిరావు ఇంటి వద్ద సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి వెళ్లాలన్న నాయకుల సూచనను సంధ్యారాణి పట్టించుకోలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ పరిణామం ఎటు దారితీస్తుందో వేచి చూడాలి. కురుపాం అభ్యర్థి తోయక జగదీశ్వరికి మాత్రం అసమ్మతి సెగ తగ్గడం లేదు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దత్తిలక్ష్మణరావు ఆధ్వర్యాన గిరిజనేతర నాయకులంతా వేరుకుంపటి పెట్టారు. పాలకొండ అభ్యర్థిగా జనసేన తరపున నిమ్మక జయకృష్ణకు టిక్కెట్ కేటాయించడంతో భంగపడ్డ పడాల భూదేవి అసమ్మతిరాగం తీస్తున్నారు. అధిష్టానం పునరాలోచించాలని, లేదంటే నాలుగు రోజుల్లో తన కార్యాచరణ జారీచేస్తానని అధిష్టానాన్ని హెచ్చరించారు. ఏం జరుగుతుందో వేచిచూడాల్సిందే.

కూటమి విష ప్రచారాన్ని తిప్పికొట్టండి

(మొదటి పేజీ తరువాయి)

ఉంటే వాటిని పక్కనపెట్టి పనిచేయాలని సూచించారు. కార్యకర్తలకు, నాయకులకు ఇవ్వాల్సిన గౌరవం, పదవులు వచ్చే ఐదేళ్లలో ఇస్తామన్నారు. మీరు కష్టపడితేనే మళ్లీ మనం అధికారంలోకి వస్తామని, మనపై మీద వచ్చే వ్యతిరేక వార్తలు, ప్రచారాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సోషల్ మీడియా ద్వారా మన ప్రచారం పెంచాలని కోరారు. చంద్రబాబు హయాంలో కూటమి దోపిడీ, దౌర్జన్యలను వివరించాలన్నారు. చంద్రబాబుకు చెప్పుకోవడానికి ఏమీలేక వైసిపిపై బురద జల్లుతున్నారన్నారు. ఆయనలాగా జగన్ పేజీలు పేజీలు మేనిఫెస్టో హామీలు ఇవ్వలేరని, ఇచ్చిన మాటను, హామీని నెలబెట్టుకొని ఓటు అడుగుతున్నామని అన్నారు.

బిజెపి అధ్యక్షురాలు పురందీశ్వరి ఐఎఎస్, ఐపిఎస్‌లపై లెటర్లు రాస్తున్నారని, హెరిటేజ్ సంస్థ మేనేజర్లను పెట్టి ఎన్నికలు నిర్వహించాలా అని ప్రశ్నించారు. ఇవేమి పట్టించుకోకుండా కష్టపడి పని చేయాలని కోరారు. ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర మాట్లాడుతూ ప్రజలు మన వెంట ఉన్నారని, కార్యకర్తలు వారిని ఓటింగ్ వేయడానికి వచ్చే విధంగా చైతన్యం తీసుకొని రావాలన్నారు. అనంతరం ఎంపి బెల్లాన చంద్రశేఖర్, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మాట్లాడారు. ఉమ్మడి జిల్లా ల నుంచి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా రంజాన్ వేడుకలు

(మొదటి పేజీ తరువాయి)

శుభాకాంక్షలు చెప్పారు.

రామభద్రపురం: మండల కేంద్రంతో పాటు ఆరికతోట, వివిధ గ్రామాల్లో ఉన్న ముస్లిం సోదరులు రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆరికతోట బనిహాసీం మసీద్‌లో మత గురువు ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. మత పెద్దలు మాట్లాడుతూ క్రమ శిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే ఈ పవిత్ర రంజాన్ మాసం అని వివరించారు.

వేపాడ: మండలంలో సంజీవ్ మెట్ట, భరతవాణి పాలెం, బొద్దాం గ్రామాలలో గల మసీదుల వద్ద ముస్లిం సోదరులందరూ సాంప్రదాయ బద్ధంగా భక్తి భావంతో రంజాన్ వేడుకలు నిర్వహించుకున్నారు.

రంజాన్ వేడుకల్లో కళా

చీపురుపల్లి: రంజాన్ వేడుకల్లో చీపురుపల్లి అసెంబ్లీ టిడిపి అభ్యర్థి కిమిడి కళావెంకటరావు తోటి నాయకులతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళావెంకటరావు మాట్లాడుతూ ప్రేమ, సోధరబావం, శాంతికి చిహ్నమే రంజాన్ పర్వదినమని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గద్దె బాబూరావు, కిమిడి మల్లిక్ నాయుడు, రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, గవిడి నాగరాజు, జనసేన నాయకులు విసినిగిరి శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి అభ్యర్థి కోండ్రు మురళీ

15న చంద్రబాబు రాజాం రాక

కార్యకర్తల సమావేశంలో టిడిపి నాయకులు కోండ్రు

ప్రజాశక్తి- రేగిడి

మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 15న రాజాంలో నిర్వహించనున్న ప్రజాగళం సభకు హాజరవుతారని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ మంత్రి, రాజాం నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ అన్నారు. గురువారం రాజాం మండలంలోని శ్యాంపురం టిడిపి క్యాంపు కార్యాలయంలో మండల స్థాయి నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 15న సాయంత్రం రాజాంలో చంద్రబాబు రోడ్ షో నిర్వహిస్తారన్నారు. ఈ రోడ్ షో సభకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు, నిరుద్యోగులు ప్రజలు వేల సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ సభ ఉత్తరాంధ్రాకు గుర్తింపు తెచ్చే విధంగా జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు దూబ ధర్మారావు, కిమిడి అశోక్ కుమార్, నారాయణరావు, మహేశ్వరరావు, శాసపు జనార్ధన, చల్ల భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎపిఇపిడిసిఎల్, విజయనగరం, దాసన్నపేట విద్యుత్ భవన్ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్టు విద్యుత్ శాఖ ఇఇ పూడి హరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విశ్రాంత న్యాయమూర్తి, సిజిఆర్ఎఫ్ చైర్మన్ బి.సత్యనారాయణ అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో విద్యుత్ వినియోగదారులు పాల్గొని సమస్యలను పరిష్కరించుకోవచ్చునని తెలిపారు.

రూ.లక్షా 52వేలు సీజ్

బొబ్బిలి : అక్రమంగా తరలిస్తున్న రూ. లక్షా 52వేల 200ను పోలీసులు సీజ్ చేశారు. పాతబొబ్బిలి జంక్షన్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద ఎస్ఐ లోవరాజు, పోలీసులు కలిసి వాహనాలను తనిఖీ చేస్తుండగా ఎటువంటి అనుమతులూ లేకుండా ఇద్దరు వ్యక్తులు నగదు తీసుకెళ్లడంతో వారి నుంచి రూ. లక్షా 52వేల 200 సీజ్ చేశారు. తదుపరి చర్యలు నిమిత్తం జిల్లా పరిషత్ సిఇఒకు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

టిడిపిలో చేరిన సినీ దర్శకుడు ఆదిత్య

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని కుంపల్లి గ్రామానికి చెందిన సినీ దర్శకుడు పిసి ఆదిత్య గురువారం టిడిపిలో చేరారు. మంగళగిరిలోని చంద్రబాబు సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.

నేరాలు ఘోరాలు

టెక్నికల్ అసిస్టెంట్ అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - పాచిపెంట

మండల కేంద్రంలోని దళిత కాలనీకి చెందిన డోల శంకర్రావు (36) అనుమానాస్పదంగా మృతి చెందాడు. స్థానిక ఎస్సై పి.నారాయణరావు అందించిన వివరాలిలాన్నాయి. పాచిపెంటకు చెందిన డోల శంకర్రావు ఉపాధి హామీ కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. బుధవారం జరిగిన సమావేశానికి హాజరైన శంకర్రావు అనంతరం రాత్రికి ఇంటికి చేరుకోలేదు. గంగన్న దొర సమీపాన శంకర్రావు మృతి చెంది ఉండటాన్ని చూసిన మంచాడవలస గ్రామస్తులు గురువారం తెల్లవారుజామున కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకున్న అనంతరం తండ్రి రామస్వామి కొడుకు మృతి పట్ల అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. సాలూరు రూరల్ సీఐ బాలకృష్ణ, ఎస్ఐ పి.నారాయణరావు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తా ఒకరు మృతి

నలుగురికి గాయాలు

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

మండలంలోని కారాడవలస మలుపులో ఆటోబోల్తా పడి ఒకరు మృతి చెందగా, నలుగురికి గాయాలైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. ఈసంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. తాళ్ల బురిడి నుంచి సీతానగరం మండలం నిడగల్లు శుభకార్యానికి ఐదుగురు ప్రయాణికులతో వెళ్తున్న ఆటో, హెచ్ కారాడవలస మలుపులో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి బోల్తా పడింది. దీంలో ప్రయాణిస్తున్న పైల సింహాచలం(68) గాయపడగా, ఆయన్ను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. మిగతా వారికి గాయాలు కాగా, జిల్లా కేంద్ర ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. రూరల్ ఎస్సై దినకర్ వివరాలు నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన మహిళ మృతి

ప్రజాశక్తి -సీతానగరం

మండలంలోని కొత్తవలసకు చెందిన ముచ్చి మంగమ్మ (23) పార్వతీపురం జిల్లా ఆసుపత్రిలో చికిత్సపొందుతూ గురువారం మృతి చెందారు. ఎస్ఐ రాజేష్ అందించిన వివరాల ప్రకారం గతనెల 20న కొత్తవలసలోని తనకన్నవారి ఇంట్లో స్నానం నిమిత్తం కట్టెలతో వేడినీరు మరగబెడుతుండగా ప్రమాదవశాత్తూ చీరకొంగుకు నిప్పు అంటుకోగా శరీరంమొత్తం కాలిపోయింది. ఆమెను పార్వతీపురం జిల్లాఆసుపత్రిలో ఈనెల 1న చికిత్స నిమిత్తం చేర్చారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందింది. మంగమ్మకు గతఏడాది మండలంలోని సూరమ్మపేట గ్రామానికి చెందిన బొబ్బిలి గౌరీశంకరరావుతో వివాహం జరిగింది. గౌరీశంకరరావు సూరమ్మపేట వాలంటీరుగా పనిచేస్తున్నాడు. వీరికి కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు.

సారా తయారీ కేంద్రాలపై దాడులు

ప్రజాశక్తి -కొమరాడ

మండలంలోని ఆంధ్రా, ఒడిశా సరిహద్దు గ్రామాల్లో ఎస్ఇబి, పోలీసుల ఆధ్వర్యంలో అంతర్రాష్ట్ర దాడులను నిర్వహించారు. ఈ దాడుల్లో కొమరాడు ఎస్సై నీలకంఠం, పార్వతీపురం రూరల్ ఎస్సై దినకర్, ఎసిబి సిఐతో పాటు ఒడిశాపోలీసులు సంయుక్త దాడుల నిర్వహించారు . ఈ దాడుల్లో 9000 లీటర్ల బెల్లపు ఊట, 300 లీటర్ల సారాను ధ్వంసం చేసినట్లు ఎస్ఇబి ఎఇఎస్ జీవన్ కిషోర్ తెలిపారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో సారా నియంత్రణకు చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. సారా రవాణా తయారీ అమ్మకాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు.

బెల్లం ఊట ధ్వంసం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నాటు సారా తయారీకి ఉపయోగించే బెల్లం ఊటను స్థానిక పోలీసుల ధ్వంసం చేశారు. గురువారం స్థానిక ఎస్ఐ డి. రామ గణేష్ అందించిన వివరాల ప్రకారం కొత్త పేట పరిది అప్పయ్య పేట పరిసరాల్లో నాటుసారా తయారీలో వినియోగించే 250 లీటర్ల బెల్లం ఊట ఉన్నట్లు సమాచారం రావడంతో పోలీసులతో వెళ్ళి ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు.

కిమిడికి తప్పని ఇంటిపోరు

- వెనక్కి తగ్గేది లేదంటున్న నాగార్జున
- కలుపుకొని వస్తామంటున్న కళా
- ఆసక్తికరంగా చీపురుపల్లి రాజకీయాలు

ప్రజాశక్తి- చీపురుపల్లి

పెదనాన్న ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి ఓ వైపు సన్నద్ధం అవుతుండగా... ఆయనకు వ్యతిరేకంగా నామినేషన్ వేసి ఎన్నికలలో నిలబడతానని నాగార్జున అంటున్నారు. ఈ ఆశక్తికరమైన రాజకీయం చీపురుపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రారంభమై ఊపందుకుంది. చీపురుపల్లి అసెంబ్లీ నియోజకవర్గం ఇన్చార్జితో పాటు విజయనగరం జిల్లా అద్యక్షుడిగా కిమిడి నాగార్జున గత ఐదేళ్ల నుండి పని చేస్తున్నారు. తన శాయశక్తులా అటు మంత్రి బొత్స సత్యన్నారాయణను, జిల్లా పరిషత్ ఛైర్మన్‌ను, ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్‌ని ఎదుర్కొని పోరాటాలు చేశారు. 2014లో కిమిడి మృణాలిని ఇక్కడ నుండి పోటీ చేసి బొత్స సత్యన్నారాయణపై గెలుపొంది మంత్రిగా పని చేశారు. 2019లో ఆమె కుమారుడైన కిమిడి నాగార్జునకి టిడిపి చీపురపల్లి టిక్కెట్ ఇచ్చింది. అప్పుడు పోటీ చేసిన నాగార్జున బొత్స సత్యన్నారాయణపై ఓడిపోయారు. అయినప్పటికి తన వెంట ఉన్న ఏ ఒక్క కార్యకర్తనూ టిడిపి నుండి ప్రత్యర్ధి పార్టీవైపు చూడకుండా వారి కష్టసుఖాలలో అహర్నిసలు అధికార పార్టీకి ఎదురొడ్డి నిలబడ్డారు. నియోజకవర్గంలో ఏ ఒక్క కార్యకర్తకు కష్టం వచ్చినా తానున్నానంటూ వారికి అండగా నాగార్జున నిలబడ్డాడు. దీంతో నాగార్జున పై నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభిమానులు ఏర్పడ్డారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో చీపురుపల్లి అసెంబ్లీ నుండి నాగార్జునిని కాదని అనేక పేర్లని అదిష్టానం ప్రతిపాదనలోనికి తీసుకురావడంతో నాగార్జున మనస్తాపానకి గురైయ్యాడు. అంతే గాకుండా అదిష్టానం ఏమీ నాగార్జునతో సంప్రదించకుండా కిమిడి కళావెంకటరావుకి చీపురుపల్లి అసెంబ్లీ టిక్కెట్ ప్రకటించడపట్ల షాకయ్యాడు. దీంతో తాను ఎంటి పరిస్థితులలోనూ పోటీలో ఉంటానని తన అనుచర వర్గంతో చెబుతున్నట్లు సమాచారం. అందుకు తగ్గట్టుగా ఈ నెల 18 లేదా 20వ తేదీలలో చీపురుపల్లి అసెంబ్లీ నుండి నామినేషన్ వేయనున్నట్లు నాగార్జున కార్యకర్తల వద్ద ప్రస్తావించినట్లు తెలిసింది. అందుకు సిద్ధంగా ఉండాలని కార్యకర్తలకు, అభిమానులకు సూచించినట్లు సమాచారం. ఇది ఇలా ఉండగా చీపురుపల్లి టిక్కెట్టుని గెద్దలా తన్నుకుపోయిన కిమిడి కళా వెంకటరావు ఇప్పటి వరకు నాగార్జునుని కలవడం గానీ, కనీసం ఫోన్ కూడా చేయలేదని నాగార్జున వర్గం చెబుతున్నారు. అదిష్టానం ఇంత చె బు తు న్న ప్ప టి కీ కళావెంకటరావు వ్యవహార శైలి భిన్నంగా ఉండడంతో టిడిపి కేడర్‌లో, నాయకులలోనూ ఒకింత అసహనానికి తావిస్తోందని పలువురు చర్చించుకుం టున్నారు. ఐదేళ్లపాటు చీపురుపల్లిలో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు, ఆర్ఇసియస్ విలీనానికి వ్యతిరేకంగా పోరాటంతో పాటు అనేక అంశాలపై నాగార్జున చేసిన కృషి ప్రజల మనసుల్ని ఆకట్టుకున్నప్పటికీ నాగార్జున్‌ను ఎందుకు కలుపుకు పోవడంలేదని కళావెంకటరావుని పలువురు నాయకలు ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. నాలుగు మండలాలలో జరిగిన కార్యకర్తల సమావేశాలలో కూడా కళావెంకటరావుతో నాగార్జునుని కలుపుకొని పోవాలని, లేదంటే గెలుపు కష్టమవుతుందని చెబుతున్నారు. ఇవేమీ పట్టించుకోకుండా కళావెంకటరావు ఒంటెద్దు పోకడతో ముందుకు వెలుతున్నట్లు కొంతమంది నాయకులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా కిమిడి కుటుంబాలలో విరోదాలు మరచి కలసి ప్రజలలోనికి వెల్లి ప్రచారం నిర్వహిస్తారో లేదా చీపురుపల్లి నుండి కళావెంకటరావు, నాగార్జునలు వేరు వేరు నామినేషన్లు వేస్తారో వేచి చూడాల్సిందే.

రాజ్యలక్ష్మీపురంలో ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు సాంబమూర్తి

సమస్యల పరిష్కారంలో ఎమ్మెల్యే వైఖరి ప్రకటించాలి

ప్రజాశక్తి - కొమరాడ

నియోజవర్గంతో పాటు మండలంలో దీర్ఘకాల సమస్యలపై ప్రస్తుత ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి తన వైఖరితో పాటు పార్టీ వైఖరిని వెంటనే ప్రకటించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. ప్రజల పక్షాన ఉంటూ ప్రజల కోసం పోరాటం చేస్తున్న ఎర్రజెండా ఎంపి, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ మండలంలోని రాజ్యలక్ష్మి పురం, కోనవలస, డంగభద్ర గ్రామాల్లో గురువారం ప్రచారం నిర్వహించారు. పూర్ణపాడు-లాబేసు వంతెన, గుమ్మిడి గెడ్డ, ఏనుగుల సమస్యపై ఎమ్మెల్యే తమ పార్టీ వైఖరిని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు మహిళలు, ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై ఎల్లవేళలా స్పందించి పోరాటం చేస్తున్న సిపిఎం పార్టీ తరపున ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న మండంగి రమణను, అరుకు పార్లమెంటు స్థానానికి ఎంపీగా పోటీ చేస్తున్న పాచిపెంట అప్పలనర్సను సుత్తి, కొడవలి, నక్షత్రం గుర్తుపై ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎపి గిరిజన సంఘం జిల్లా కమిటీ నాయకులు హెచ్.రామారావు, సిపిఎం నాయకులు పి.సింహాచలం, పలువురు నాయకులు పాల్గొన్నారు.

సీతంపేటలో జరిగిన ఆత్మీయ సమావేశంలో సంఘీభావం తెలుపుతున్న కూటమి నాయకులు

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

ప్రజాశక్తి - సీతంపేట

గెలుపే లక్ష్యంగా టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పనిచేయాలని ఉమ్మడి అభ్యర్థి నిమ్మక జయకృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఉమ్మడి మండలాల పార్టీ అధ్యక్షులు సవరతోట మొఖలింగం (టిడిపి), బిడ్డిక విశ్వనాథం (జనసేన), ఆరిక అమల (బిజెపి) ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జయకృష్ణ మాట్లాడుతూ మండలం నుంచి అత్యధిక మెజారిటీ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జనసేన, టిడిపి, బిజెపి నాయకులు గర్బాన సత్తిబాబు, గేదెల చిరంజీవి, సవర జమయ్య, టి.తేజోవతి, ఆర్.రంగనాథం, ఇమరక పవన్, గంట సుధ, తోయిక సంధ్యారాణి నియోజకవర్గ ఉమ్మడి పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.అనంతరం సోమగండిలో కూటమి ప్రచారం నిర్వహించారు.

భామిని : క్షేత్ర స్థాయిలో జనసేన పార్టీ గుర్తు గ్లాస్ ను, ప్రజలులోకి తీసుకువెళ్లి, మన ప్రభుత్వం లో చేపట్టే కార్యక్రమాలు వివరించి, అత్యధిక మెజారిటీ భామిని మండలం లో సాధించాలని పాలకొండ టి డి పి, జనసేన, బి జె పి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మక జయకృష్ణ తెలిపారు. భామినిలోని టిడిపి, జనసేన, బిజెపి కార్యకర్తలు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. రాబోయే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. కార్యక్రమం లో తూర్పుకాపు నాయకులు పి.కృష్ణమూర్తి నాయుడు, జనసేన ఉపాధ్యక్షులు గుర్బనా సత్తి బాబు, నిమ్మక పాండురంగరావు, టి డి పి నాయకులు తేజోవతి, మండల టి డి పి అధ్యక్షులు బి. రవినాయుడు, ప్రధాన కార్యదర్శి ఎం. జగదీశ్వరరావు, సీతంపేట మండల టిడిపి అధ్యక్షులు సవర తోట ముఖలింఘం, మండలం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వీరఘట్టం: జనసేన అధినేత కొణిదల పవన్ కళ్యాణ్ లేకపోతే జయకృష్ణకు పాలకొండ టికెట్టు వచ్చేది కాదని అరకు పార్లమెంటరీ బీసీ సెల్ కన్వీనర్ పి.కృష్ణమూర్తి నాయుడు అన్నారు. స్థానిక జామివారి కాంప్లెక్స్ లో కూటమి సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రతి కార్యకర్త బాధ్యతగా పనిచేసి జనసేన విజయకేతనానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల, పట్టణ టిడిపి అధ్యక్షులు ఉదయాన ఉదయ్ భాస్కర్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపి అభ్యర్థి అదితి ప్రచారం

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం నగరంలోని 16వ డివిజన్ లో కొనిసి వీధి, బేరి చావిడి వీధి, శివాలయం వీధి, చాకలి వీధి, కమ్మ వీధి, పార్క్ గేట్, కోలగట్లవారి వీధి తదితర ప్రాంతాల్లో టిడిపి అభ్యర్థి పి.అదితి విజయలక్ష్మి గజపతిరాజు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను ప్రజలకు వివరించారు, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టిడిపి,.జనసేన , బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పడాలని, నియోజకవర్గం అభివృద్ధి చెందాలన్నా, శాంతి భద్రతలు బాగుండాలన్నా టిడిపి అధికారంలోకి రావాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, రాష్ట్ర బిసి నాయకులు శ్రీనివాసరావు అవనాపు విజయ్, పిల్లా విజయ్‌కుమార్, గాడు అప్పారావు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -వీరఘట్టం

స్థానిక విద్యుత్ ఉపకేంద్రంలో అదనపు కొత్త పవర్ ట్రాన్స్ఫార్మర్ అమర్చేందుకు, ఛార్జింగ్ చేసేందుకు గానూ మండల పరిధిలో పనులు చేయడం వల్ల శుక్రవారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్టు పాలకొండ డివిజన్ ఇఇ టిజికె మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. కావున వీరఘట్టం, వీరఘట్టం సబ్‌స్టేషన్ పరిధిలో కడకెళ్ళ, నదిమికెళ్ళ, విక్రంపురం, కంబర, నడుకురు, వీరఘట్టం, చలివేంద్రి, దశమంతపురం, మహదేవివలస, నర్సిపురం, కొట్టుగుమడ, గడగమ్మ, రీగులపాడు, కత్తులకవిటి, ఎంకె రాజపురం చిదిమి, తుడి పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, కావున విద్యుత్ వినియోగ దారులు గమనించి సహకరించాలని కోరారు.

పిసిసి అధ్యక్షురాలు షర్మిలను కలిసిన రామకృష్ణ

అభ్యర్థిని మార్చే యోచనలో కాంగ్రెస్

పిసిసి చీఫ్‌ను కలిసిన గేదెల రామకృష్ణ

ప్రజాశక్తి - సాలూరు

రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిని మార్చే యోచనలో ఆ పార్టీ రాష్ట్ర అధిష్టానం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తుండ పంచాయతీ జగ్గుదొరవలసకు చెందిన మువ్వల పుష్పారావును ప్రకటించింది. గిరిజన యువ నాయకుడు పుష్పారావు పేరును మన్యం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నిమ్మక సింహాచలం సిఫార్సు చేశారు. అయితే ఆయన సిఫార్సు చేసే ముందు నియోజకవర్గానికి చెందిన నాయకులను, మిత్ర పక్షాలైన వామపక్ష నాయకులను సంప్రదించలేదనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇటీవల ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేయడానికి సిద్ధమైన జనసేన మాజీ నాయకుడు గేదెల రామకృష్ణ కూడా కాంగ్రెస్ ఎమ్మెల్యే సీటు కోసం దరఖాస్తు చేసినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆయన పేరును పార్టీ రాష్ట్ర నాయకత్వం పరిశీలనలోకి తీసుకున్నదనే ప్రచారం జరుగుతోంది. రామకృష్ణ ఉన్నత విద్యావంతుడు, సహకారశాఖలో పని చేసి కొద్ది నెలల ముందు స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. ఈ ప్రాంతంలో ఎక్కువ కాలం ఆయన పని చేయడంతో పాటు గిరిజనులతో బంధుత్వాలు కూడా వున్నాయి. ఆయన ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తే బాగుంటుందని స్థానిక కాంగ్రెస్ నాయకులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన పేరును కాంగ్రెసు అధిష్టానానికి పంపించారు. కొద్ది రోజుల క్రితం రామకృష్ణ హైదరాబాద్ లోటస్ పాండ్‌లో పిసిసి చీఫ్ వైఎస్ షర్మిలను కలిశారు. త్వరలో ఆయన పేరును ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటిస్తారనే వాదనలు వినిపిస్తున్నాయి.

హడావుడిగా పార్టీ కార్యాలయ ప్రారంభం

కాంగ్రెస్ అభ్యర్థిని మారుస్తారనే ఊహాగానాలు బలంగా వినిపిస్తున్న తరుణంలో ఇప్పటికే ప్రకటించిన అభ్యర్థి మువ్వల పుష్పారావు జిల్లా పార్టీ అధ్యక్షులు నిమ్మక సింహాచలంతో కలిసి బుధవారం రాత్రి పట్టణంలో ఆదరాబాదరాగా పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. దీనిపై స్థానిక నాయకులకూ ఎలాంటి సమాచారం లేదని తెలుస్తోంది. పట్టణంలో కాంగ్రెస్‌కు కొంతవరకు కేడర్ ఉంది. 15వ వార్డు కౌన్సిలర్ ద్వారపు రెడ్డి విశాలాక్షి గత అనేక సంవత్సరాలుగా కాంగ్రెస్‌లో వుంటున్నారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా సిగడాపు బంగారయ్య వున్నారు. వీరెవరినీ పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవానికి పిలవకుండా ప్రారంభించడం చర్చనీయాంశమవుతోంది.

ఓటరు మహాశయా... నీవెక్కడయ్యా!

ప్రజాశక్తి పాలకొండ

అయిదేళ్లుగా ఓటర్లు ఎక్కడున్నారో కనిపించని నాయకులు ఇప్పుడు ఓటర్లను వెతుక్కుని వెళ్తున్నారు. ఓటర్లు కోసం తిరిగి, వారి యోగక్షేమాలు కనుక్కునే పరిస్థితి కనిపిస్తుంది. అధికారంలో ఉన్న వైసిపితో పాటు ప్రతిపక్షంలో ఉన్న కూటమి పార్టీలు కూడా ఓటర్ల సమస్యలపై దృష్టి పెట్టిన దాఖలాల్లేవు. పాలకొండ మండలంలో తాగునీటి సమస్యలతో పాటు ఇతర ప్రధాన సమస్యలు కూడా ఉన్నాయి. గిరిజన ప్రాంతాల్లో కూడా అనేక సమస్యలు వెంటాడుతున్నాయి. అయితే ఓటర్ల దగ్గరకు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకునేందుకు తీరికలేని నాయకులు ఇప్పుడు మాత్రం ఓటర్లు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

నాగూరు టు కురుపాం

57 ఏళ్ల పాలనలో చినమేరంగి కోటదే హవా . ఒకసారి సిపిఎంకు పట్టం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కురుపాం అసెంబ్లీ నియోజకవర్గం ఎస్‌టి రిజర్వుడ్‌లో ఉంది. 2014 ముందు నాగూరు నియోజకవర్గంగా ఉండేది. ఈ నియోజకవర్గం పరిధిలో గల గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లో ఎక్కువ శాతం గిరిజన ఓటర్లే ఉన్నారు. మిగిలిన జియమ్మవలస, కొమరాడ, గరుగుబిల్లి మండలాల్లో ఎక్కువ శాతం మంది బిసి ఓటర్లు ఉన్నారు. అయితే మొదటి నుంచీ ఈ నియోజకవర్గంలో ఎమ్మెల్యేలుగా గెలుపొందుతున్న వారంతా గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లో ఉన్న ఓటు బ్యాంక్ మెజార్టీతోనే విజయం సాధించడం విశేషం. అందుకే ప్రతిసారి పై రెండు మండలాలపైనే పోటీ చేస్తున్న అభ్యర్థులు ఫోకస్ పెడుతుంటారు.

57 ఏళ్ల పాలనలో చినమేరంగి కోటదే హవా...

1962 నుంచి 2019 వరకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎక్కువసార్లు చినమేరంగి కోట నుంచి అభ్యర్థులు ఎమ్మెల్యేగా గెలుపొందుతున్నారు. ఇందులో కేవలం మూడు పర్యాయాలు మాత్రమే బయట వ్యక్తులు ఎమ్మెల్యేలుగా కొనసాగారు. 1962లో మొదటిసారిగా గుమ్మలక్ష్మీపురం ప్రాంతం నుంచి అడ్డాకుల లక్ష్మణ్ నాయుడు (కాంగ్రెస్) ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1994లో నిమ్మక జయరాజు (టిడిపి), 2004లో కోలక లక్ష్మణమూర్తి (సిపిఎం) గెలుపొందగా, 1972లో కురుపాం కోటకు చెందిన విసిసి దేవ్ ఎమ్మెల్యేగా గెలుపొందారు.

కురుపాం అసెంబ్లీ నియోజకవర్గ స్వరూపం

కురుపాం నియోజకవర్గంలో కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియమ్మ వలస, కొమరాడ, గరుగుబిల్లి మండలాలు ఉన్నాయి. 137 పంచాయతీలు, 1276 వార్డులు, 71 ఎంపిటిసి స్థానాలు ఉన్నాయి. నియోజకవర్గ విస్తీర్ణం 172.00 చదరపు కిలోమీటర్లు. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 1,92,638 ఉండగా, 268 పోలింగ్ స్టేషన్ల ఉన్నాయి. భౌగోళిక పరిస్థితులు... పూర్వం నాగూరు నియోజకవర్గ పరిధిలో కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియమ్మ వలస, కొమరాడ, గరుగుబిల్లి మండలాలు కలిపి 2014లో కురుపాం నియోజకవర్గంగా ఆవిర్భవించింది. వరి,జీడి, జొన్న పంటలు ఎక్కువగా పండిస్తుంటారు. నాగావళి, జంఝావతి, వట్టిగెడ్డ, గుమ్మిడి గెడ్డ వ్యవసాయ సాగుకు అందుబాటులో ఉన్నాయి.

నాగూరు టూ కురుపాం

2009 నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా పూర్వం ఉన్న నాగూరు నియోజకవర్గాన్ని కురుపాం నియోజకవర్గంగా మార్చారు. గరుగుబిల్లి, కొమరాడ మండలాలు రెండు పూర్తిగా కురుపాంలో కలిశాయి. ఇదే నియోజకవర్గంలో శత్రుచర్ల కుటుంబం తొలి నుండి రాజకీయంగా ఆధిపత్యం కొనసాగిస్తూ వచ్చింది. విజయరామరాజు ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. నాగూరులో నాలుగు సార్లు, పార్వతీపురం, పాతపట్నంలో ఒక్కొక్కసారి విజయం సాధించారు. ఇక ఈ నియోజకవర్గంలో 2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా గెలిచిన జనార్ధన థాట్రాజ్ 2014 ఎన్నికల ముందు శత్రుచర్లతో కలిసి టిడిపిలో చేరారు. ఎస్టీ నియోజకవర్గ కావడంతో ఇక్కడ సిపిఎం కూడా పట్టు కొనసాగిస్తోంది. ఇక 2014 ఎన్నికల నాటికి స్థానిక ఎమ్మెల్యే పుష్ప శ్రీవాణి రెండుసార్లు గెలుపుతో కురుపాంలో వైసీపీ ఆధిపత్యం రెండుసార్లు కనిపించింది.

1,92,636 మంది ఓటర్లు

కురుపాం అసెంబ్లీ నియోజకవర్గంలో 268 పోలింగ్ కేంద్రాల పరిధిలో 1,92,636 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 93,592, మహిళా ఓటర్లు 99,005 ఉన్నారు. థర్డ్ జెండర్ 39 మంది ఓటర్లు ఉన్నారు. గుమ్మలక్ష్మీపురం మండలంలో 16068 మంది పురుష ఓటర్లు, 18812మంది మహిళా ఓటర్లు, 16మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. జియమ్మవలస మండలంలో 21,721మంది పురుషులు, 21,978 మహిళలు 8 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. కురుపాం మండలంలో 16825 పురుషులు, 18054 మంది మహిళా ఓటర్లు, 12మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. కొమరాడ మండలంలో 19717 మంది పురుష ఓటర్లు, 21050 మహిళా ఓటర్లు, ముగ్గురు థర్డ్ జెండర్ ఓటు హక్కు కలిగి ఉన్నారు. గరుగుబిల్లి మండలంలో 19261 పురుషులు,19104 మహిళలు ఓటు హక్కు కలిగి ఉన్నారు.

అభ్యర్థి మార్పుపై పవన్ కల్యాణ్ పున:పరిశీలించాలి

- అభ్యర్థిని మార్చకపోతే భవిష్యత్తుపై నిర్ణయం
- పడాల భూదేవితో సమావేశమైన నాలుగు మండలాల టిడిపి నాయకులు

ప్రజాశక్తి - పాలకొండ

పాలకొండ నియోజకవర్గం జనసేన అభ్యర్థిని మార్చేందుకు అధినేత పవన్ కల్యాణ్ పునఃపరిశీలించాలని జనసేన నాయకులు పడాల భూదేవి కోరారు. నియోజకవర్గం పరిధిలోని పాలకొండ, సీతంపేట, వీరఘట్టం, భామిని మండలాల టిడిపి కార్యకర్తలు, పడాల భూదేవి అభిమానులు గురువారం పాలకొండలోని ఒక ప్రైవేటు కల్యాణ మండపంలో ఆమె సమావేశమయ్యారు. నాలుగు మండలాల నుంచి వచ్చిన మాజీ ఎంపీపీలు, జడ్పిటిసిలు, ఎంపీటీసీలు, ప్రస్తుత సర్పంచులు, మాజీ సర్పంచ్ లు, పార్టీ కార్యకర్తలు పడాల భూదేవితో భవిష్యత్తు కార్యాచరణ గురించి చర్చించారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి, ఆమె మాట్లాడుతూ పవన్ కల్యాణ్‌పై తమకు ఇంకా నమ్మకముందన్నారు. టిడిపి, జనసేన పార్టీల క్యాడర్ తనకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నారని, తనకిచ్చిన మాటని పవన్ కల్యాణ్ నిలబెట్టుకుని తనను ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించి తనకు న్యాయం చేయాలని భూదేవి కోరారు. మాజీ జెడ్పిటిసి సామంతుల దామోదరరావు మాట్లాడుతూ జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ పాలకొండకు ప్రకటించిన అభ్యర్థిని మార్చి, భూదేవిని అభ్యర్థిగా ప్రకటించాలని కోరారు. పాలకొండలో జనసేన జెండా ఎగరాలంటే, భూదేవి అభ్యర్థిత్వంతోనే సాధ్యమని అన్నారు. జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్పర్సన్ ఖండాపు జ్యోతి, సీనియర్ టిడిపి నాయకులు ఖండాపు వెంకట రమణమూర్తి మాట్లాడుతూ గత నెల 27న పార్టీలో పడాల భూదేవిని చేర్చుకొని అభ్యర్థిగా ప్రకటిస్తామని పవన్‌కల్యాణ్ హామీ ఇచ్చారని తెలిపారు. ఈ మేరకు ఈనెల 7న అనకాపల్లిలో భూదేవిని పార్టీలో చేర్చుకున్నారన్నారు. పడాలి భూదేవిని అభ్యర్థిగా ప్రకటిస్తారని ఎదురుచూస్తున్న తరుణంలో, ఆమెను కాదని జయకృష్ణను ప్రకటించడం అన్యాయమని రమణమూర్తి పేర్కొన్నారు. మాజీ ఎంపిపి డాక్టర్ సి.ఎల్. నాయుడు మాట్లాడుతూ, పడాల భూదేవిని అభ్యర్థిగా ప్రకటించకుండా వేరే వారిని ప్రకటించడంపై నియోజకవర్గంలో నాలుగు మండలాల టిడిపి, జనసేన కార్యకర్తలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, కార్యకర్తలకు తాము సమాధానం చెప్పలేకపోతున్నామని, కావున పవన్‌కల్యాణ్ తప్పనిసరిగా పునః పరిశీలించి పడాలి భూదేవిని అభ్యర్థిగా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో పాలకొండ మాజీ ఎంపిపి వారాడ సుమంత్ నాయుడు, సీతంపేట ఏజెన్సీ ప్రాంతానికి చెందిన చర్చి ఫాదర్ జాన్ ఫాదం కోతం గ్రామ సర్పంచ్ గంగయ్య, నాలుగు మండలాల పార్టీ నాయకులు, సీతంపేట మాజీ ఎంపీపీ సవర కుంపి, జంపు చంద్రశేఖర్, బుల్లిబాబు, గుమ్మడి సింహాద్రి, పైల సత్యం నాయుడు, నడిమికెళ్ల సర్పంచ్ ఎం.వి.రమణ, కరణం లక్కునాయుడు తదితరులు మాట్లాడారు.

సమావేశంలో మాట్లాడుతున్న పడాల భూదేవి

అభిమానులను చూసి కన్నీరు పెట్టిన భూదేవి

భవిష్యత్తు కార్యాచరణ నిమిత్తం గురువారం పాలకొండలోని ఒక ప్రైవేట్ కల్యాణ మండపంలో నాలుగు మండలాల ముఖ్య నాయకులతో సమావేశమైన నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు పడాల భూదేవి నాలుగు మండలాల నుంచి స్వచ్ఛందంగా తరలివచ్చిన వందలాదిమంది అభిమానులను చూసి కంటతడి పెట్టారు. అభిమానులనుద్దేశించి మాట్లాడుతూ, పార్టీ అధ్యక్షులు, మన నాయకులు పవన్ కల్యాణ్‌పై తమకు ఇంకా నమ్మకం ఉందని, తప్పకుండా న్యాయం చేకూరుస్తారని అన్నారు.

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి

సంధ్యారాణి

ప్రజాశక్తి - పాచిపెంట

తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని టిడిపి, జనసేన, బిజెపి సాలూరు ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. గురువారం పాచిపెంటలో గల పిన్నింటి వారి పామాయిల్‌తోటలో మండల టిడిపి అధ్యక్షులు పిన్నింటి ప్రసాద్ బాబు అధ్యక్షతన మండల పార్టీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె నాయకులను, కార్యకర్తలను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. జగన్ మళ్లీ వస్తే రాష్ట్రం రావణకాష్టంగా మారుతుందన్నారు. ప్రతి ఒక్కరికీ ఉద్యోగం ఇస్తామని వాలంటీర్ ఉద్యోగం ఇచ్చారని, చంద్రబాబు నాయుడు సిఎం అయిన వెంటనే యువతకు గౌరుప్రదమైన ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని అన్నారు. ఒక్కసారి తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని, ఈ ఒక్కసారి అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్‌పి భంజుదేవ్, సాలూరు, మెంటాడ మండల టిడిపి నాయకులు ముఖీ సూర్యనారాయణ, గూడెపు యుగంధర్, పిన్నింటి ఈశ్వరరావు, బిజెపి, జనసేన నాయకులు, పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్యం షాపులో తనిఖీలు చేస్తున్న అధికారులు

మద్యం షాపులో ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీ

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని లింగాలవలస ప్రభుత్వ మద్యం షాప్‌ను ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసింది. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారిని జి. జోత్న్స షాప్‌లోని రికార్డులను పరిశీలించారు. రికార్డుల ప్రకారం ఉన్న స్టాక్‌కు, షాపులో ఉన్న స్టాక్‌కు మధ్య ఉన్న వ్యత్యాస్ని తనిఖీ చేశారు. మద్యం అమ్మకాలను కూడా పరిశీలించారు. సిబ్బంది రామనాయుడు, ఎక్సైజ్ వి.ఒ కె.వి సన్యాసిరావు, సూపర్వైజర్ పిల్లి అప్పలరాజు పాల్గొన్నారు.

విజయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

ఎంఇఒకు ఉగాది పురస్కారం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఎంఇఒ ఈపు విజయకుమార్‌కు ఉగాది పురస్కారం లభించింది. నెల్లిమర్ల ఎంఇఒ 2గా విధులు నిర్వర్తిస్తున్న విజయ కుమార్ ఉగాది వేడుకల్లో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలో ప్రముఖ సాహితీ సంస్థలు విజయ భావన, వాగ్దేవి సమారాధనం, సాహితీ సంస్కృతి, నాటక రంగంలో రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందిన సందర్భంగా ఉగాది పురస్కారం అందజేశారు. ప్రముఖ రచయిత యల్లపు ముకుందరావు చేతుల మీదుగా విజయ భావన సంస్థ సత్కరించి వాగ్దేవి సమారాధనం సంస్థ వాగ్దేవి నట భూషణ అనే బిరుదుతో ఉగాది పురస్కారం అందజేసి సన్మానం చేశారు. ఈ సందర్భంగా పలువురు ఎంఇఒ విజయ కుమార్‌ని అభినందించారు.

టిడిపి నాయకుల ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి- బొబ్బిలి

మున్సిపాలిటీలోని పాతబొబ్బిలిలో టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయన గురువారం ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. నియోజకవర్గ అభివృద్ధికి తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. అభివృద్ధిలో వైసిపి పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో తనను గెలిపిస్తే అభివృద్ధి చేస్తామన్నారు. ప్రచారంలో జనసేన నియోజకవర్గ ఇంచార్జి గిరడ అప్పలస్వామి, టిడిపి కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, నాయకులు, పాల్గొన్నారు.

టిడిపిలో 100 కుటుంబాలు చేరిక

జామి : జామి మేజరు పంచాయితీలో వైసిపి నుంచి భారీగా టిడిపిలోకి చేరికలు జరిగాయి. గురువారం స్థానిక వెంకటేశ్వర పంక్షన్ హాల్‌లో విశాఖ టిడిపి ఉమ్మడి ఎమ్‌పి అభ్యర్థి శ్రీభరత్, ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలితకుమారి సమక్షంలో గ్రామానికి చెందిన సూరెడ్డి వీధి, రెల్లివీధి, దొండపర్తి జంక్షన్ వద్ద సుమారుగా 100 కుటుంబాల వరకూ టిడిపి కండువా కప్పుకున్నారు. రెల్లి వీధిలో 30 కుటుంబాలు వరకూ వైసిపిని వీడగా, సూరెడ్డి వీధి, దొండపర్తి జంక్షన్‌కు చెందిన సుమారుగా 70 కుటుంబాలు టిడిపిలో చేరాయి. వీరిలో వార్డు సభ్యులు చొక్కాకుల గౌరీ, సూరెడ్డి ఘాన్సీ, గంగమ్మ, అదివమ్మా, అప్పన్న, శ్రావని, అప్పలనాయుడు, సత్యం, లక్ష్మి ఉన్నారు. కార్యక్రమలో టిడిపి నాయకులు వర్రీ రమణ, అల్లాడ పెద్ద, చలుమూరి మహేష్, వేంద్రపు శ్రీను తదితరులు ఉన్నారు.

వేపాడ: మాట్లాడుతున్న గొంప కృష్ణ

సంక్షేమ పాలన టిడిపితోనే సాధ్యం

రామభద్రపురం: సంక్షేమ పాలన టిడిపితోనే సాధ్యమవుతుందని ఆ పార్టీ కార్య నిర్వాహక కార్యదర్శి చింతల రామకృష్ణ అన్నారు. గురువారం మండల పరిధిలో సోంపురం పంచాయతీ మర్రివలస గ్రామంలో టిడిపి మండల అధ్యక్షుడు కరణం విజయ భాస్కరరావు, స్థానిక సర్పంచ్ చొక్కాపు అప్పలనాయుడులతో కలిసి ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఈ సైకో జగన్ ప్రభుత్వాన్ని ఓడించి గద్దె దించాలన్నారు. స్థానిక ఎమ్మెల్యేగా కూటమి బలపరుస్తున్న బేబీనాయనకు సైకిల్ గుర్తుపై ఓటేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఎంపిటిసిలు, పాల్గొన్నారు.

దళిత ద్రోహి జగన్ పార్టీకి మద్దతు ఇవ్వం

దళిత ద్రోహి జగన్ పార్టీకి మద్దతు ఇవ్వమని కొట్టక్కి దళితవాడ ప్రజలు తీర్మానించి గురువారం టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చింతల రామకృష్ణ, ,జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు మడక తిరుపతి నాయుడు ఆధ్వర్యంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. సుమారు 30 కుటుంబాలు ఆ గ్రామ పార్టీ నేత ముళ్ళు రాంబాబు, వంగపండు భీము నాయుడుల ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో జనసేన నేతలు శ్యామ్, రమేష్, దళిత వాడ నేతలు కిరణ్, జ్ఞాన ప్రకాష్, దుర్గారావు, దిలీప్ పాల్గొన్నారు.

వేపాడ : మండలంలోని వీలుపర్తి గ్రామంలో గురువారం విశాఖ ఎమ్‌పి అభ్యర్థి శ్రీభరత్, ఎస్‌కోట ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలితకుమారి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గొంప కృష్ణ మాట్లాడుతూ ఉమ్మడి అభ్యర్థులుగా పోటి చేస్తున్న కోళ్ల లలితకుమారి, భరత్‌లను గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కోట వైస్ ఎంపిపి సుధారాణి, వేపాడ టిడిపి మండలం అధ్యక్షుడు గొంప వెంకటరావు, నాయకులు గుమ్మడి భారతి, పి రమణ, సిరికి రమణ, వీలుపర్తి సర్పంచ్ సేనాపతి లీల, సేనాపతి అప్పారావు, కోటాను అర్జునరావు, భూషణం, సేనాపతి గణేష్.జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మరోసారి అవకాశమివ్వండి

ప్రజాశక్తి- బొబ్బిలి

బొబ్బిలి పురపాలక సంఘం సంఘం పరిధిలో గల గొల్లపల్లిలో 2వ రోజు గురువారం ఉదయం ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు సార్వత్రిక ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి ఆ కుటుంబ సభ్యులకు ప్రభుత్వం చేసిన మంచిని వివరిస్తూ రాబోయే ఎన్నికలలో తనకు మరోసారి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఇప్పటికే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామని మరోసారి అవకాశమిస్తే మరింత అభివృద్ధి చేస్తానని చెప్పారు. టిడిపి,జనసేన నాయకులు మాటలు నమ్మి మోసపోవద్దని సంక్షేమం, అభివృద్ధి కేవలం వైసిపితోనే సాధ్యమని చెప్పారు.

వేపాడ: మండలంలోని వావిలపాడు గ్రామంలో బుధవారం రాత్రి ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. తనకు మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి డి. సత్యవంతుడు, జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, వైసిపి మండల అధ్యక్షుడు జగన్నాథం, గ్రామ సర్పంచ్ బీల రాజేశ్వరి, గ్రామ కన్వీనర్ బి సతీష్, బి.నాయుడు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఏను వెంకటరావు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

చీపురుపల్లి: ఇంటింటికి వైసిపి పార్టీ ప్రచారం నిర్వహిస్తోంది. గురువారం స్థానిక జెడ్‌పిటిసి వలిరెడ్డి శిరీష, తోటి నాయకులు, కార్యకర్తలతో కలసి చీపురుపల్లి పట్టణంలోని ఐదవ సచివాలయం పరిధిలోని 138వ పోలింగ్ స్టేషన్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గత ఐదేళ్లు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేసిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశ్వీరదించాలని కోరారు. ఎమ్మెల్యేగా బొత్స సత్యన్నారాయణ, ఎంపిగా బెల్లాన చంద్రశేఖర్ పోటీ చేస్తున్నారని వారికి ప్రజలు ఓటు వేసి గెలిపించాలని శిరీష ప్రజలను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, చీపురుపల్లి సర్పంచ్ మంగళగిరి సుధారాణి, బుంగ కనకేశ్వరరావు, మిరియాల కనకరత్నం, ఎల్ ప్రభాత్ కుమార్, చంద్రశేఖర్‌గుప్త, అడ్డూరి కృష్ణ, అశోక్, నారాయణశెట్టి సోమేష్, ఆశపు శ్రీను, బోనెల నాగేంద్ర, అడ్డేరి భారతి, బుంగ సంతోష్, నాసిక వెంటేష్, వినోద్, కెయ రాంబాయి తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: తనకు ఓటు వేయాలని కోరుతున్న ఎమ్మెల్యే

అణగారిన వర్గాల ఆశాజ్యోతి పూలే

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అలుపెరగని పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి మహాత్మ జ్యోతిరావు పూలే అని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి కొనియాడారు. గురువారం కలెక్టరేట్ వద్ద జ్యోతిరావు పూలే విగ్రహానికి ఎంపి బెల్లాన చంద్రశేఖర్, నగర మేయర్ విజయలక్ష్మి, బిసి సంఘం నాయకులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ బిసిల అభ్యున్నతికి పూలే చేసిన ఎనలేని కృషి మరువలేనిదన్నారు. మహిళలు కూడా చదువుకోవాలన్న ఉద్దేశంతో తన భార్య సావిత్రిబాయి పూలేను విద్యావంతురాలుగా తీర్చిదిద్ది దేశంలోనే తొలి ఉపాధ్యాయురాలుగా తీర్చిదిద్దిన ఘనత ఆయనదేనని అన్నారు. ఎంపి బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ జ్యోతిరావు పూలే ఆశయాలు అనుసరణీయమని అన్నారు. వెనుకబడిన వర్గాల హృదయాలలో చెరగని ముద్రగా నిలిచిపోయారని అన్నారు. కార్యక్రమంలో బిసి సంఘం నాయకులు నడిపేన శ్రీనివాసరావు, బొద్దాన అప్పారావు, మారం బాల బ్రహ్మారెడ్డి, గదుల సత్యలత, కెల్ల త్రినాధరావు తదితరులు పాల్గొన్నారు.

పూలే వేషధారణలో విద్యార్థులు, రామానాయుడు

పూలే ఆశయాలను ముందుకు తిసుకువెళ్లాలి

విజయనగరం కోట : జ్యోతిరావు పూలే ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని ఉత్తరాంధ్ర బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు ముద్దాడ మధు అన్నారు. ఉత్తరాంధ్ర బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యాన పూలే జయంతి నిర్వహించారు. పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పిన్నింటి సూర్యనారాయణ, మొదిలి నాగభూషణరావు, గుంప అప్పలరాజు, మజ్జి అప్పారావు, చోడి ఆదినారాయణ, పాండ్రంకి వెంకటరమణ, ఎలిగేటి విజయలక్ష్మి, గొలగాని రమేష్, కెల్ల శ్రీనివాసరావు, బూర వాసు, కిల్లంపల్లి ఆచారి తదితరులు పాల్గొన్నారు.

పూలే కృషి అమోఘమైనది

విజయనగరం కోట : అణగారిన వర్గాల అభ్యున్నతికి పూలే చేసిన కృషి అమోఘమని శ్రీనివాస ఆర్ట్స్ అకాడమీ ప్రధాన కార్యదర్శి ఆర్‌బి రామానాయుడు, నారాయణ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ మొయిద నారాయణరావు అన్నారు. గాజులరేగ నారాయణ పబ్లిక్ స్కూల్‌లో పూలే జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు విద్యార్థులు ఉపాధ్యాయులు పూలమాలవేసి నివాళులర్పించారు అనంతరం పూలే వేషధారణలతో అలరించారు.

పూలే స్ఫూర్తితో ముందుకు వెళ్లాలి

విజయనగరం కోట : జ్యోతిరావు పూలే స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని విజయనగరం నియోజకవర్గ టిడిపి అభ్యర్థి పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. పూలే జయంతి సందర్భంగా లోక్ సభ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడుతో కలిసి తొలుత అశోక్‌బంగ్లాలోను, అనంతరం కలెక్టరేట్ వద్దగల పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదితి గజపతి రాజు మహిళలు చదువుకోవాలని, వారు పురోగతి పథంలో ఉంటే సమాజం బాగుంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మి వరప్రసాద్ పాల్గొన్నారు.

వేపాడ: మండల కేంద్రంలోని వల్లంపూడి గ్రామంలో జ్యోతిరావు ఫూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మండల దళిత మహాసభ అధ్యక్షుడు కొమనాపల్లి రాము మాట్లాడుతూ జ్యోతిరావు పూలే ఒక సామాజిక విప్లకారుడని ఆయనలో ఉన్న తపన అతనకు ఇంతటి గుర్తింపును తెచ్చిపెట్టిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గుత్తి శ్రీను, కే అప్పారావు, జవాన్, బి. అప్పారావు, ఎస్ రమణ, టి కృష్ణ, ఆర్ సన్నిబాబు, పార్వతి, సత్యవతి, మనీ, వనిత పాల్గొన్నారు.

కొత్తవలస: మండలంలోని తాడివని పాలెం, చింతలపాలెం గ్రామంలో జ్యోతిరావుపూలే 197వ జయంతి ఉత్సవాలను అంబేద్కర్ హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉత్తరాంధ్ర కన్వీనర్ ప్రముఖ అంబేద్కర్ రిస్ట్ రిట్టపల్లి అప్పన్న, ఎస్‌కోట నియోజకవర్గం బిఎస్‌పి అధ్యక్షులు బోని రాంబాబు హాజరై ప్రసంగించారు. సామాజిక విప్లవ పరివర్తకులలో జ్యోతిరావుపూలే ఈ సమాజానికి అశేషమైన సేవలు అందించారన్నారు. తన సతీమణి సావిత్రిబాయి పూలే ద్వారా, మహిళలకు చదువు చెప్పిన ఘనత, మహిళల ద్వారా సామాజిక విప్లవాన్ని రూపొందించిన రూపకర్త జ్యోతిరావు పూలే అని కొనియాడారు.

పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

భోగాపురం: మండలంలోని రెడ్డికంచెరు గ్రామంలో జ్యోతిరావు పూలే 198వ జయంతిని బిఎస్‌పి నెల్లిమర్ల నియోజకవర్గం అధ్యక్షులు ఎరుకొండ వెంకటరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ నెల్లిమర్ల నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఎరుకొండ తేజరాణి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనగారిన వర్గాలను అగ్రవర్ణ బానిసత్వం నుంచి విముక్తులను చేసిన గొప్ప సంఘ సంస్కర్త అని ఆమె కొనియాడారు.

పూలే చిత్రపటం వద్ద నివాళ్ళు అర్పిస్తున్న సిఐటియు నాయకులు

నివాళ్ళు అర్పిస్తున్న జాయింట్ కలెక్టర్ శోబిక, డిఆర్ఒ కేశవనాయుడు

గొప్ప స్త్రీ వాది జ్యోతిరావుపూలే

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మానవులందరిలో గొప్ప స్త్రీవాది జ్యోతిరావుపూలేనని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ కొనియాడారు. జ్యోతిబా పూలే జయంతి స్థానిక సుందరయ్య భవనంలో గురువారం ఘనంగా నిర్వహించారు. తొలుత పూలే చిత్రపటానికి సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు, రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బారావమ్మ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సుబ్బరావమ్మ మాట్లాడుతూ బాలికా విద్య కోసం 1851లో మరో రెండు పాఠశాలల్ని నెలకొల్పారు. శ్రామిక ప్రజల కోసం 1855లో 'రాత్రి బడి'ని స్థాపిం చారన్నారు. అలాగే దిగువ కులాల ప్రజలకు సమాన హక్కులను పొందడానికి సత్యశోధక్ సమాజ్ (సొసైటీ ఆఫ్ సీకర్స్ ఆఫ్ ట్రూత్)ను ఏర్పాటు చేశారన్నారు. అట్టడుగు కులాలకు విద్యను అందించడంలో సహాయం చేయాలని పిలుపునిచ్చారన్నారు. దీన్ని అమలు చేయడా నికి, ఆయన గ్రామాల్లో ప్రాథమిక విద్యను తప్పనిసరి చేయాలని సూచించార న్నారు. పూలే అణిచివేతకు గురౌతున్న పేదల పక్షాన పోరాడటమే కాకుండా, అగ్రవర్ణ వితంతువుల పునర్వివాహానికి గొప్పకృషి చేశారని కొనియాడారు. 'ఒక పురుషునికి విద్యనందిస్తే, వీరు ఒక వ్యక్తికి విద్యను అందిస్తారు, కానీ మీరు ఒక స్త్రీకి విద్యను అందిస్తే వారు మొత్తం కుటుంబానికి విద్యను అందిస్తారని పూలే పలుమార్లు చెప్పారన్నారు. అందుకే ఆయన్ను సమన్యాయ సత్య శోధకుడని పిలుస్తార్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణా రావు, ప్రధాన కార్యదర్శి వై. మన్మధరావు, నాయకులు వి.ఇందిర, ఎన్‌వై నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో...

మహాత్మా జ్యోతిరావు పూలే 198 జయంతి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా జరిగింది. జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక జ్యోతిరావు పూలే చిత్ర పటానికి పుష్పమాలాలంకరణ, జ్యోతి ప్రజ్వలన చేసి నివాళ్ల అర్పించారు. అనంతరం జెసి మాట్లాడుతూ భారత జాతికి స్ఫూర్తినిచ్చిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అన్నారు. సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారని ఆమె చెప్పారు. స్త్రీ, పురుష సమానత్వం కోసం జీవితాంతం కృషి చేశారని కొనియాడారు. జ్యోతిరావు పూలే జీవితం ఆదర్శమని, స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్ ఛార్జ్ జిల్లా రెవెన్యూ అధికారి జి కేశవ నాయుడు, ఎస్డిసి ఆర్‌వి సూర్యనారాయణ, జిల్లా బిసి సంక్షేమ సాధికారిత అధికారి ఎస్.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వీరఘటం : మండలంలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు గురువారం ఘనంగా పలుచోట్ల జరిగాయి. ఈ సందర్భంగా నడుకూరు, బొడ్లపాడు, తదితర గ్రామాల్లో జనసేన నాయకులు ఎం పుండరీకం, జనసేన జానీ జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు.

డోకిశీలలో ఎల్ఇడి లైట్ల వెలుతురులో హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

స్వచ్ఛంద సంస్థ సహకారంతో విద్యుత్ వెలుగులు

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

జిల్లాకు చెందిన స్వచ్ఛంద సంస్థ జన కల్యాణ సమాఖ్య ఇన్నోవేషన్ ఇండియా లిమిటెడ్ ఫిలిప్స్ సహకారంతో పార్వతీపురం, కొమరాడ మండలాలకు చెందిన సుమారు 61 గిరిజన గ్రామాల్లో ఏర్పాటు చేసిన వీధిలైట్లు సత్ఫలితాలు ఇస్తూ వారి గ్రామాలలో వెలుగులు విరుజుముతున్నాయి. కొమరాడ మండలం అంకుళ్లవలస, కోనవలస, మసిమండ, పుడేసు, బూర్జవలస, సరుగుడు గూడతో పాటు పార్వతీపురం మండలం శివందొరవలస, కొత్త ఊరు, వెలగవలస, జిల్లేడువలస డోకిశీల, కొసరివాని వలస గ్రామాల్లో సుమారు 700 వీధి దీపాలను ఏర్పాటు చేశారు. ఈ ఎల్ఇడి వీధిలైట్లు ఎక్కువ కాంతి ప్రసారం చేయడంతో పాటు విద్యుత్తు వాడకం కూడా ఆదా అవుతుందని గ్రామస్తులు తెలిపారు. స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన ఈ లైట్లు వల్ల తమకు ఎంతో ప్రయోజనం సమకూరిందని రాత్రివేళ నిర్భయంగా బయటికి వస్తున్నామని ప్రజలు చెబుతున్నారు. అత్యధిక వెలుగులు ఉండడం వల్ల అడవి జంతువులబారి నుండి తమ గూళ్ళలో ఉన్న కోళ్లు, మేకలు, పశువులను రక్షించుకోగలుగుతున్నామని గ్రామస్తులు తెలియజేశారు. తమ సంస్థ ఎజెండాను అనుసరించి సామాజిక బాధ్యతగా గిరిజన గ్రామాల్లో ఈ లైట్లు ఏర్పాటు చేసి ఎంతో కొంత వారికి సహాయపడాలన్న ఉద్దేశంతో సిగ్నిఫై ఇన్నోవేషన్ ఇండియా లిమిటెడ్ వారి సహకారంతో ఖర్చుకు వెనకాడకుండా ఈ దీపాలను అమర్చామని ఆ సంస్థ కార్యదర్శి నిధిల్ వర్గీస్ తెలియచేశారు.

గ్రామాల్లో పోలీసు కవాతు

ప్రజాశక్తి -గరుగుబిల్లి

మండలంలోని కొత్తూరు, శివ్వాం గ్రామాల్లో గురువారం స్థానిక ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీస్ కవాతు జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్ఐ అమ్మన్న రావు అన్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకు పోలీసులు కవాతు నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వ హించేందుకు ప్రజలు సహక రించాలని కోరారు. అదే విధంగా సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాలను గుర్తించామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ పిఎఫ్‌కు చెందిన పోలీసులు పాల్గొన్నారు.

ఓటమి భయంతో వైసిపి అసత్య ప్రచారం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కురుపాం నియోజకవర్గంలో వైసిపి నాయకులు ఓటమి భయంతో అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని మండల టిడిపి కన్వీనర్ పాడి సుదర్శన్‌రావు ఆరోపించారు. గురువారం గుమ్మలక్ష్మీపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం మాట్లాడారు. కురుపాం అభ్యర్థి జగదీశ్వరిని మార్చి కురుపాం కోటకు చెందిన వైరిచర్ల వీరేశ్‌దేవ్‌కు టిక్కెట్ కేటాయిస్తారని వైసిపి అవాస్తవాలను ప్రచారం చేస్తుందన్నారు. ఓటమి భయంతో వైసిపి మైండ్‌గేమ్ ఆడుతుందని, కావున టిడిపి కార్యకర్తలు అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. టిడిపి సీనియర్ నాయకులు కద్రక కళావతి మాట్లాడుతూ గిరిజన మహిళ తోయక జగదీశ్వరికి టిడిపి అధిష్టానం టికెట్ ఇచ్చిందని, కావున ఆమెను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని విజ్ఞప్తి చేశారు. శత్రుచర్ల విజయరామరాజు నాయకత్వంలో రాష్ట్ర కార్యదర్శి వీరేష్ చంద్రదేవ్‌తో పాటు మిగతా నాయకులంతా జగదీశ్వరి విజయానికి కష్టపడి పనిచేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు టిడిపి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పట్టణంలో టిడిపి ప్రచారం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పార్వతీపురం నియోజకవర్గ టిడిపి అభ్యర్థి బోనెల విజయ చంద్ర గురువారం పార్వతీపురం పట్టణంలోని 20,21 వార్డుల్లోనూ విస్తృత ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ద్వారపురెడ్డి శ్రీదేవి, బిజెపి జిల్లా పార్టీ అధ్యక్షులు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, నాయకులు సొండి సంజీవి, జనసేన నాయకులు చెందకు అనిల్ కుమార్, ఆగూరు మణి, టిడిపి నాయకులు బడే గౌరీ నాయుడు, గొట్టాపు వెంకట నాయుడు బార్నాల సీతారాం, బోను చంద్రమౌళి, గుంపస్వామి తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం మండలంలోని సూరంపేటలో టిడిపి అభ్యర్థి బోనెల విజయ్‌చంద్ర ప్రచారం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే బి.చిరంజీవిలు, మండల అధ్యక్ష కార్యదర్శులు ఆర్ వేణుగోపాల్ నాయుడు, పి.సత్యనారాయణ, మండల నాయకులు కె.తిరుపతిరావు ఎస్ హరిగోపాలరావు పెద్దబ్బాయితో పాటు గ్రామ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు కుటుంబాలు టిడిపిలో చేరాయి.

సీతానగరం : సూరంపేటలో పార్టీ కండువేసి ఆహ్వానిస్తున్న విజయచంద్ర

ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించండి

ప్రజాశక్తి - కురుపాం

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా వేదిక అభ్యర్థులకు ప్రజలు ఓట్లు వేసి గెలిపించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జి.సూరయ్య పిలుపునిచ్చారు. గురువారం నియోజకవర్గ కేంద్రమైన కురుపాంలో విలేకరులతో మాట్లాడుతూ అధికారమే లక్ష్యంగా, అవకాశవాద రాజకీయాలకు నిలువుటద్దంగా నిలిచే జగన్, బాబు, పవన్‌లను బిజెపిలను ఓడించాలని పిలుపునిచ్చారు. పదేళ్ల బిజెపి పాలనలో రాజ్యాంగం కల్పించిన హక్కులు, రక్షణ చట్టాలు, సంక్షేమ పథకాలు కాలరాసి ఇచ్చిన హామీలను ఒకటి నెరవేర్చకపోగా చంద్రబాబు నాయుడు, పవన్‌కల్యాణ్ బిజెపికి ఎందుకు మద్దతు ఇస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని, అలాగే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ లోపాయికారిగా మోడీకి మద్దతిస్తూ రాష్ట్ర ప్రయోజనాల కన్నా స్వప్రయోజనాలే ముఖ్యమని ఉన్నారని అన్నారు. గత ఎన్నికల్లో గిరిజనులు, దళితులు, బడుగు, బలహీన వర్గాల ప్రజలు వైసిపికి ఓట్లు వేస్తే వారిపైనే ధమనకాండ సాగిస్తున్నారని విమర్శించారు. గిరిజన, దళిత రక్షణ చట్టాలను కాలరాస్తున్నారని అందుకనే 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తొత్తు, పొత్తు పార్టీలైన టిడిపి, బిజెపి, కూటములను, వైసిపి ప్రభుత్వాన్ని ఓడించి ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

ప్రార్థనలు చేస్తున్న ముస్లిములు

ఘనంగా రంజాన్ వేడుకలు

ప్రజాశక్తి - కురుపాం

జిల్లాలో పలుచోట్ల రంజాన్ వేడుకలు ఘనంగా జరిగాయి. నెల రోజుల ఉపవాస దీక్ష అనంతరం గురువారం ఈదుల్ ఫితర్ ప్రత్యేక ప్రార్థన స్థానిక జమియా మసీద్ ఆవరణలో ఇమామ్ సర్దార్ ఆలం అధ్వర్యంలో అత్యంత భక్తి శ్రద్ధలతో ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ప్రతి ముస్లిం విధిగా పాటించాల్సిన విషయాలు 5 పూటలా నమాజ్, రోజంతా ఉపవాస దీక్ష, జకాత్ అంటే దానం, హజ్ యాత్ర, ఇస్లాం సందేశాన్ని తప్పక పాటించాలని సూచించి పవిత్ర రంజాన్ పండుగ సారాంశాన్ని ఇమామ్ సర్దార్ వివరించారు. ప్రార్థన తర్వాత ముస్లిం సోదరులు ఒకరిని ఒకరు ఆలింగనం చేసుకుని పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్ర మంలో మత పెద్దలు షేక్ అతవుల్లా, షేక్ ఖలీల్, షేక్ జిలానీ, షేక్ అజిం బాషా, షేక్ యాకుఫ్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిములకుకిషోర్ దేవ్ శుభాకాంక్షలు

రంజాన్ పండగను పురస్కరించుకుని కేంద్ర మాజీ మంత్రి వైరిచర్ల కిషోర్ చంద్రదేవ్ గురువారం కురుపాంలో గల తన కోట సమీపంలో ఉన్న శివన్నపేట ముస్లిములకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వమతాల సమ్మేళనమే భారతదేశం అని హిందూ, ముస్లిం, క్రిస్టియన్ అంతా కలిసికట్టుగా ఉంటూ ఒకే కుటుంబ సభ్యుల ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు షేక్ గౌస్, షేక్ జిలాని తదితరులు పాల్గొన్నారు.

నిరంతర శ్రామికుడు సింహాచలం

భామిని : ప్రజాసమస్యలపైనా, దళిత, గిరిజన, పేదల, రైతాంగ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమించిన నాయకులు బర్రి సింహాచలమని మండల సిపిఎం నాయకులు కొండగొర్రి భాస్కరరావు నివాళ్ల అర్పించారు. మండలంలోని బురుజోలలో సిపిఎం నాయకులు బర్రి సింహాచలం 9వ వర్ధంతి గురువారం జరిగింది. ఈ సందర్భంగా సింహాచలం చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం భాస్కరరావు మాట్లాడుతూ రైతాంగం హక్కుల సాధన కోసం తన జీవితాంతం కృషి చేశారని కొనియాడారు. సింహచలం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బర్రి పార్వతమ్మ, బి.రామకృష్ణ, విక్రమ్ పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా కార్యదర్శిగా బిపి నాయుడు

వీరఘట్టం : శ్రీకాకుళం ఉమ్మడి జిల్లా జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి బి ఫకీర్ నాయుడు, జిల్లా సంయుక్త కార్యదర్శిగా వజ్రగడ రవి కుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ పార్టీ బలోపేతనికి మరింత కృషి చేస్తామని హామీ ఇచ్చారు .

పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, జెసి తదితరులు

జ్యోతిరావు పూలేకు నివాళి

ప్రజాశక్తి-విజయనగరం

మహాత్మా జ్యోతిరావు పూలేకి జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆడిటోరియంలో పూలే 198వ జయంతి గురువారం ఘనంగా జరిగింది. పూలే చిత్రపటానికి కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. జ్యోతిరావు జాతికి చేసిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. కార్యక్రమంలో డిఆర్ఒ ఎస్‌డి అనిత, డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణ చక్రవర్తి, డిబిసిడబ్ల్యూఒ సందీప్‌కుమార్, వసతి గృహ సంక్షేమాధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కిలో బంగారం పట్టివేత

ప్రజాశక్తి - పాలకొండ

పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ పట్టణంలో గాయత్రీ ఆలయ సమీపాన చెక్ పోస్ట్ దగ్గర బుధవారం అర్ధరాత్రి పోలీసులు కేజి బంగారాన్ని పట్టుకున్నారు. ఒడిశాలోని రాయఘడ నుంచి శ్రీకాకుళం వెళ్తున్న కారులో సింహాద్రి సూరత్ అనే వ్యక్తి నుంచి ఈ బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎటువంటి ఆధారాలూ చూపకపోవడంతో బంగారాన్ని స్థానిక సబ్-ట్రెజరీ కార్యాలయానికి తరలించి, అనంతరం పార్వతీపురం జిల్లా ట్రెజరీకి పంపించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

రేపు డయల్ యువర్ ఆర్‌టిసి డిఎం

ప్రజాశక్తి-విజయనగరం కోట

విజయనగరం ఆర్‌టిసి డిపో పరిధిలోని ప్రయాణికుల సమస్యలపై శుక్రవారం డయల్ యువర్ డిఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ జె. శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి ఐదు గంటల వరకు డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. డిపో పరిధిలో గల ప్రయాణికులందరూ ఎటువంటి సమస్యలున్నా ఫోన్ ద్వారా తెలిపి నివృత్తి చేసుకోవాలని ఆయన కోరారు. సమస్యలపై డిపో మేనేజర్ ఫోన్‌నెంబరు 9959225620లో సంప్రదించాలన్నారు.

గాయపడిన మహిళకు ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన రామతీర్థం గ్రామానకి చెందిన మామిడిపాక లక్ష్మి విజయనగరం వస్తూ ఆటో ప్రమాదంలో గాయపడింది. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబ సభ్యులకు గురువారం స్థానిక శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద జిల్లా ఆర్యవైశ్య మిత్రుల గ్రూపు సభ్యులు రూ17వేలు ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో గ్రూప్ అధ్యక్షుడు శ్రీ ఆలివెళ్లి శేఖర్, కార్యదర్శి డిమ్స్ రాజు, కోశాధికారి సముద్రాల నాగరాజు, జిలా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కుమ్మరిగుంట శ్రీనివాసరావు, దుడ్డు కామేష్, పెంటపాటి కామరాజు, ఎవి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

కేజీ జీడి రూ.200కు కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కేజీ జీడి పిక్కలు రూ.200కు అధికారులు కొనుగోలు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కోలక అవినాష్ డిమాండ్ చేశారు. గిరిజనులు పండించే పంటల్లో బతుకు జీవనాధారమైన జీడి ధర మార్కెట్లో రూ. 80 నుంచి రూ. 100 మాత్రమే ఉండడంతో గిరిజనులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. జిసిసి, ఐటిడిఎ అధికారులు స్పందించి జీడి పిక్కలను కొనుగోలు చేసి ధర రూ.200 నిర్ణయించాలని డిమాండ్ చేశారు. అప్పుడే గిరిజనులు పండించే పంటలకు సరైన గిట్టుబాటు ధర ఉంటుందని అన్నారు.

వీరఘట్టంలో పోలీసు కవాతు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలో గురువారం పోలీస్ కవాతు నిర్వహించారు. ఎన్నికల నియమావళిలో భాగంగా ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చునని, ఎటువంటి సంఘటనలు జరగకుండా ఉండేందుకు నిర్భయంగా తమ ఓటును వేసుకోవచ్చునన్నారు. ఈ సందర్భంగా దళిత, కస్పా, మెయిన్ రోడ్డు, తదితర వీధుల్లో పోలీస్ కవాతు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సై ఎస్కే ఫక్రుద్దీన్, ఫారా బలగాలు పాల్గొన్నారు.

రూ.50వేలు కంటే ఎక్కువ నగదు ఉంటే సీజ్

- సీజ్ చేసిన నగదు, వస్తువులకు రసీదు ఇవ్వాలి
- జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

తనిఖీల్లో రూ.50వేలు కంటే ఎక్కువ నగదు లభిస్తే వెంటనే సీజ్ చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి ఆదేశించారు. ఈ నగదు ఎన్నికలకు సంబంధించినది అని తేలితే, వెంటనే సీజ్ చేసి, కేసు నమోదు చేయాలని, ఎన్నికలతో సంబంధం లేకపోతే, జిల్లా గ్రీవెన్స్ కమిటీకి నివేదించాలని సూచించారు. స్వాధీనం చేసుకున్న నగదు లేదా వస్తువుల వివరాలను నమోదు చేసి, వాటి యజమానికి తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని ఆదేశించారు. సీజ్ చేసుకున్న నగదు లేదా వస్తువుల వివరాలను ఇఎస్ఎంఎస్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఆర్ఒలు, ఎఆర్ఒలు, ఫ్లయింగ్ స్క్వాడ్స్, స్టేటిక్ స్క్వాడ్స్ సభ్యులతో కలెక్టరేట్ నుంచి గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. క్షేత్రస్థాయిలో ఆయా బృందాల పనితీరు, నమోదు చేసిన కేసులపై కలెక్టర్ సమీక్షించారు. క్షేత్రస్తాయిలో తనిఖీలను ముమ్మరం చేయాలని ఆదేశించారు. ఫ్లయింగ్ స్క్వాడ్స్ విస్తృతంగా పర్యటించాలన్నారు. నగదు, వస్తువులను సీజ్ చేసేటప్పుడు పాటించాల్సిన నియమ నిబంధనలను వివరించారు. ఎక్కడైనా అనధికారికంగా రూ.50వేలు కంటే ఎక్కువ నగదును తరలిస్తున్నప్పుడు, వారి దగ్గర నగదుకు సంబంధించి ఎటువంటి ఆధారాలు లేకపోతే సీజ్ చేసి, జిల్లా గ్రీవెన్స్ కమిటీకి నివేదించాలని సూచించారు. జెడ్‌పి సిఇఒ ఆధ్వర్యంలోని ఈ కమిటీ రోజుకు రెండుసార్లు సమావేశమై, సీజ్ చేసుకున్న నగదు, వస్తువులపై వారివద్దనున్న ఆధారాలను, పత్రాలను పరిశీలించి, తగిన నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. కమిటీ ఆదేశాల ప్రకారం కేసు నమోదు చేయడం లేదా, నగదును విడిచిపెట్టడం జరుగుతుందన్నారు. నగదు లేదా వస్తువులు రాజకీయ పార్టీలకు సంబంధించివని తేలితే, వెంటనే సీజ్ చేసి కేసు నమోదు చేయాలని, కమిటీకి తెలియజేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

రూ.10వేలు కంటే విలువైన బహుమతులను, తగిన పత్రాలు లేకపోతే సీజ్ చేయవచ్చునని చెప్పారు. రూ.10లక్షలు కంటే ఎక్కువ విలువైన నగదు, లేదా వస్తువులను గుర్తిస్తే ఇఎస్ఎంఎస్‌లో నమోదు చేసి, వివరాలను ఆదాయపు పన్నుశాఖకు పంపించాలని ఆదేశించారు. అలాగే బంగారు ఆభరణాలకు సంబంధించి వివాహిత మహిళ 500 గ్రాముల ఆభరణాలను, ఇతర మహిళలు 250 గ్రాముల ఆభరణాలను, పురుషులు 100 గ్రాముల ఆభరణాలను తమ వెంట తీసుకువెళ్లవచ్చునని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డిఆర్ఒ ఎస్‌డి అనిత, జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజా, డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, నోడల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

కంట్రోల్ రూమును పరిశీలించిన కలెక్టర్

కలెక్టరేట్‌లోని ఎన్నికల కంట్రోల్ రూమును జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి గురువారం సందర్శించారు. వివిధ విభాగాల కార్యకలాపాలను పరిశీలించారు. నమోదు చేసిన కేసులను, తీసుకున్న చర్యలను జిల్లా కలెక్టర్‌కు సిపిఒ పి.బాలాజీ, నోడల్ అధికారి డాక్టర్ సత్య ప్రసాద్ వివరించారు. జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డిఆర్ఒ ఎస్‌డి అనిత కలెక్టర్ వెంట ఉన్నారు.

సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఉపకరణాల ఎంపిక శిబిరాలు : డిఇఒ

ప్రజాశక్తి -విజయనగరం టౌన్

సమగ్ర శిక్షా-విద్యాశాఖ ఆధ్వర్యంలో వికలాంగ విద్యార్థులకు ఉపకరణాల ఎంపిక శిబిరాలను నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. క్లస్టర్ల వారీ నిర్వహించే ఈ వైద్య శిబిరాల్లో 12వ తేదీన గరివిడి మండల క్లస్టర్ పరిధి గుర్ల, మెరకముడిదాం, చీపురుపల్లి, గరివిడి మండలాలకు గరివిడి భవితా కేంద్రం వద్ద, రాజాం క్లస్టర్ పరిధిలోని సంతకవిటి, రేగిడి ఆముదాలవలస, వంగర, రాజాం మండలాలకు రాజాం భవితా కేంద్రం వద్ద ఎంపిక శిభిరాలను నిర్వహిస్తామని చెప్పారు. 15న గజపతినగరం క్లస్టర్ పరిధిలోని మెంటాడ, దత్తిరాజేరు, బొండపల్లి, గంట్యాడ, గజపతినగరం మండలాలకు గజపతినగరం భవితా కేంద్రం వద్ద, రామభద్రపురం క్లస్టర్ పరిధిలో బొబ్బిలి, బాడంగి, తెర్లాం, రామభద్రపురం మండలాలకు రామభద్రాపురం భవితా కేంద్రం వద్ద శిబిరం నిర్వహిస్తామన్నారు. 18న డెంకాడ క్లస్టర్ పరిదిలో నెల్లిమర్ల, పూసపాటిరేగ, భోగాపురం, విజయనగరం, డెంకాడ మండలాలకు డెంకాడ భవితా కేంద్రం వద్ద, కొత్తవలస, లక్కవరపుకోట, వేపాడ, జామి, ఎస్.కోట మండలాలకు ఎస్.కోట భవితా కేంద్రం వద్ద వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరాలను జిల్లాలో ఉన్న 3 నుండి 18 సంవత్సరాల వయసు గల శారీరక, సెరిబ్రల్ పాల్సీ, వినికిడి లోపం గల వారు పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వృద్ధులను ఓట్లు అభ్యర్థిస్తున్న బెల్లాన వైసిపి అభ్యర్థులు బెల్లాన, కోలగట్ల

అవినీతి లేని పాలన అందించాం : ఎంపి బెల్లాన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్రంలో అవినీతి లేని పాలన అందించామని ఎంపి బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. నగరంలోని కొత్త ధర్మపురి లో జరిగిన ఇంటింటి ప్రచార కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామితో కలిసి ఎంపి బెల్లాన గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి ఏదో ఒక రూపంలో ప్రభుత్వ పథకాలను నేరుగా అందించిన ఘనత తమదేనన్నారు. వాలంటరీ వ్యవస్థ ద్వారా అవినీతి రహితంగా ప్రభుత్వ పథకాలను అందించామని అన్నారు. జగన్మోహన్ రెడ్డి నేతత్వంలో పారదర్శక పాలనను చూసి చంద్రబాబు తట్టుకోలేకపోతున్నాడని అన్నారు. అందుకే వాలంటరీ వ్యవస్థ పై అక్కసు వెళ్లగక్కుతున్నాడని అన్నారు. టిడిపిపై ప్రజలలో నమ్మకం పోయిందన్నారు. నగర మేయరు విజయలక్ష్మి మాట్లాడుతూ నగరం అభివృద్ధి చెందిందంటే అందుకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి కృషి అని అన్నారు.కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పతివాడ గణపతి రావు, డివిజన్ ఇన్‌ఛార్జి కనకల కృష్ణ, జోనల్ ఇంఛార్జి బొద్దాన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అత్యాధునిక సదుపాయాలతో కెవిఎస్ హోటల్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం కోట

నగరంలోని తిరుమల-మెడికవర్ ఆస్పత్రి ఎదురుగా నూతనంగా నిర్మించిన కెవిఎస్ లాడ్జీ కమ్ హోటల్‌ను గురువారం వైసిపి సమన్వయకర్త, రాజ్యసభ సభ్యులు వైవి సుబ్బారెడ్డి, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఎంపి బెల్లాన చంద్రశేఖర్, గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య, ఎమ్మెల్సీ సురేష్‌బాబు ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రజలందరికీ అందుబాటులోకి ఇటువంటి హోటల్ రావడం మంచి పరిణామమని అన్నారు. ఆధునిక హంగులతో ఏర్పాటు చేసిన ఈ హోటల్ దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. హోటల్ అధినేత కుప్పిలి శ్రీను మాట్లాడుతూ అందరూ సహాయ సహకారాలు అందించాలని కోరారు. హోటల్‌లో అత్యాధునిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. సామాన్య ప్రజలకు సైతం అందుబాటులోకి ఉండాలనే ఉద్దేశంతో ఈ లాడ్జీ కమ్ హోటల్‌ను ప్రారంభించా మన్నారు. రూములు సాధారణ ధరలకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, హోటల్ అధినేత కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

కెవిఎస్ హోటల్‌ను ప్రారంభిస్తున్న రాజ్యసభ సభ్యులు కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి